## నీలగిరి నిత్యపద్యం

**ఆటవెలది**

మాకులమ్ము వాడు, మా మతమ్ము ననుచు
మాకు స్నేహితుడను , మమత వీడి
మంచితనము జూచి సంచితముగ నీవు
ఓటు వేయవోయి మేటిగాను

మీ
నలుమాసు విజయప్రసాద్
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్


తెలుగు దిన పత్రిక

సంచిక : 232 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 09-12-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# మాతృభూమి ఔన్నత్యాన్ని చాటేలా వందేమాతరం

- వేదకాలం నుంచి మాతను కొలవడం ఆదర్శం
- అదే స్ఫూర్తితో వందేమాతర గీతం రచన
- దేశ స్వాతంత్ర్యానికి వందేమాతరం ప్రేరణ
- ఈ గీతమే జనప్రవాహాన్ని కదలించింది
- బ్రిటిష్ వారితో పోరాటంలో ముందు నిలిచింది
- కానీ..నెహ్రూ ఈ గీతాన్ని అవమానించాడు
- జిన్నా ఉద్యమానికి తలొగ్గిన నెహ్రూ
- వందేమాత్రం 150 ఏళ్ల ప్రస్తానంపై లోక్‌సభలో మోడీ ప్రసంగం

**న్యూఢిల్లీ, ,డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేశ స్వాతంత్ర్యానికి వదేమాతర గీతం ప్రేరణ అని ప్రధాని మోడీ అన్నారు. కోట్లాది మంది భారతీయులు ఈ గీతానికి ఉత్తేజితులై స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారని అన్నారు. ఇది దేశానికి ప్రేరణ ఇచ్చిన గీతమని, స్వాంతంత్ర్య సముపార్జనకు నాందిగా మారిందని అన్నారు. లోక్‌సభలో వందేమాతర గీతం 150వ వార్షికోత్సవంపై జరిగిన చర్చలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఈ చర్చ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. బకించంద్ర ఛటోపాధ్యాయ రాసిన వందేమాతర గీతం బెంగాల్‌లో బాగా ప్రాచుర్యం అయినట్లు మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా వార పత్రిక 'ఇండియన్ ఒపినియన్'లో -మిగతా 2 లో

# రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్

- అబద్దాలే ఆయన శ్వాసగా పాలన
- రేవంత్‌ది ప్రైవేట్ లిమిటెడ్ పాలన
- రెండేళ్లుగా దోపిడీ తప్ప పారదర్శకత ఏదీ
- రెండేళ్ల పాలనపై బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, ,డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్ అని, ఆయన ఏం మాట్లాడినా అబద్ధమే అంటూ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. రెండేండ్ల పాలనలో దోపిడీ తప్ప పారదర్శక లేదని, ఆత్మస్తుతి, పరనింద తప్ప రేవంత్ చేసిందేమీ లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రిది ప్రైవేట్ లిమిటెడ్ పాలన అని, తన రెండేండ్ల పాలనలో చేసింది ఒక్కటైనా చెప్పగలడా అని ప్రశ్నించారు. ప్రజాభవన్‌ను జల్సాలకు, విందులు, వినోదాలకు ప్రజాభవన్‌ను కేరాఫ్‌గా మార్చారు అంటూ ఘాటు -మిగతా 2 లో



# తెలంగాణ రైజింగ్ అన్ స్టాపబుల్

**రాష్ట్ర ఎదుగుదలలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి**


**హైదరాబాద్, ,డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్ అంటూ రాష్ట్ర ఎదుగుదలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కొత్త రాష్ట్రమైన తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. 2047కు సరికొత్త లక్ష్యాలు నిర్దేశించుకొని ముందుకు సాగుతున్నామన్నారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలనేదే తమ ఆశయమన్నారు. ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న ' తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. -మిగతా 2 లో

- కొత్త రాష్ట్రం అయినా అభివృద్ధిలో దూకుడు
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ మా లక్ష్యం
- దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10శాతం ఉండాలనేది ఆశయం
- గాంధీ, అంబేద్కర్ సిద్ధాంతాలే తెలంగాణ అభివృద్ధి మార్గదర్శకాలు
- క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్ల అభివృద్ధి మోడల్ అమలు
- అభివృద్ధి ప్రయాణంలో గ్లోబల్ ఇన్వెస్టర్లు కీలక భాగస్వాములు
- పెట్టుబడులకు తెలంగాణ అన్ని విధాలుగా అనుకూలం
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

## జపాన్‌ను వణించిన
# భారీ భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై 7.6 తీవ్రతతో భూకంపం
- సునామీ హెచ్చరికలు జారీ..!

**న్యూఢిల్లీ,**
ఉత్తర జపాన్ తీరంలో సోమవారం శక్తివంతమైన భూకంపం సంభవించింది. దాంతో సునామీ హెచ్చరికలు జారీ చేసినట్లు జపాన్ వాతావరణ సంస్థ పేర్కొంది. తీర ప్రాంతనగరమైన అమోరికి సమీపంలోని హక్కైడో తీరంలో రిక్టర్ స్కేల్‌పై 7.6 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు తెలిపింది. సముద్ర ఉపరితలం నుంచి 50 కిలోమీటర్ల దిగువన భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. దాంతో జపాన్ పసిఫిక్ తీర ప్రాంతంలో సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈశాన్య తీరాన్ని 10 అడుగుల ఎత్తు వరకు అలలు ఎగిసిపడే అవకాశం ఉందని పేర్కొంది.ఉత్తర జపాన్ అంతటా హక్కైడో, అమోరి, ఇవాటేతో సహా అనేక ప్రాంతాలు సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ ప్రాంతంలో అణువిద్యుత్ కేంద్రాలు ఉండడంతో హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ ప్రాంతంలో అణు విద్యుత్ ప్లాంట్ల భద్రతా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌హెచ్‌కే పేర్కొంది. భూకంపం కారణంగా ఇప్పటి వరకు ఏమైనా నష్టం జరిగిందా? అన్న వివరాలు మాత్రం తెలియరాలేదు.



## హైదరాబాద్ దేశ ఆర్థిక వ్యవస్థకు
# మూలస్తంభం

**ఐటీ, ఇన్నోవేషన్, ఫార్మా, ఏరోస్పేస్ టెక్నాలజీలకు కేంద్రం**

- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీనిపెంచేందుకు కలసికట్టుగా కృషి
- రాష్ట్రాల సహకారంతోనే వికసిత భారత్ కల సాకారం
- ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా భారత్ అవతరణ
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, ,డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హైదరాబాద్ కేవలం ఓ రాష్ట్రానికి రాజధాని నగరం కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం లాంటిదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఐటీ హబ్‌గా, ఇన్నొవేషన్ కారిడార్‌గా, ఫార్మాసూటికల్ క్యాపిటల్‌గా, ఏరోస్పేస్ టెక్నాలజీ సెంటర్‌గా వర్ధిల్లుతోంది. ఈ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని మరింత పెంచేందుకు అందరమూ కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. 2047 నాటికి మన దేశం వికసిత భారత్‌గా వెలుగొందాలని తరచూ ప్రధాని మోదీ పిలుపునిస్తూ ఉంటారు. అయితే రాష్ట్రాల సహకారంతోనే ఈ కల -మిగతా 2 లో



# వందేమాతరంపై ఇప్పడే ఎందుకు చర్చ?

- ఎందుకంటే..బెంగాల్ ఎన్నికలు మాత్రమే
- అలాగే సమస్యల నుంచి దృష్టి మళ్లించడం కూడా
- నెహ్రూ విజన్‌తోనే నేటి సాంకేతకి ప్రగతి సాగింది
- లోక్‌సభలో వందేమాతరంపై ప్రియాంక ప్రసంగం

**న్యూఢిల్లీ,**
దేశానికి స్వాతంత్య్రరం వచ్చి 79 ఏళ్లు అవుతున్నదని, ఇప్పుడు వందేమాతరంపై చర్చ దేనికని కాంగ్రెస్ పార్టీ వాయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ ప్రశ్నించారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్రం లోక్‌సభ లో ఈ గేయంపై చర్చ చేపట్టింది. ఈ చర్చలో పాల్గొన్న ప్రియాంకాగాంధీ ప్రభుత్వాన్ని పైవిధంగా ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు వందేమాతరంపై చర్చ చేపట్టడానికి రెండే రెండు కారణాలు ఉన్నాయని ప్రియాంకాగాంధీ చెప్పారు. అందులో మొదటిది వచ్చే ఏడాది జరగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు కాగా, రెండోది దేశ ప్రజల దృష్టిని భవిష్యత్తు వైపు మళ్లకుండా గతంపైనే నిలిపి ఉంచడం కోసమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ మంచి ప్రసంగం చేశారు కానీ, నిజాలు చెప్పడంలో ఆయన బలహీనంగా కనిపించారని అన్నారు. అంతేగాక 'మీరు ఎన్నికల కోసం పనిచేస్తుంటే మేం దేశ ప్రజల కోసం పనిచేస్తున్నాం' అని బీజేపీని ఉద్దేశించి ప్రియాంకాగాంధీ అన్నారు. మేం ఎన్ని ఎన్నికలు ఓడిపోయామనేది విషయం కాదని, మేం ప్రజల కోసం మీతో, మీ సిద్ధాంతాలతో పోరాడుతూనే ఉంటామని చెప్పారు. దేశం కోసం మా పోరాటం కొనసాగుతుందని, మా పోరాటాన్ని మీరు అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. భారతదేశంలోని ప్రతి అణువులో వందేమాతరం ఉందని, మరి దాని గురించి చర్చించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కారణంగా కేంద్ర ప్రభుత్వం వందేమాతరం గురించి -మిగతా 2 లో



## ఐదేళ్ల జగన్ పాలనలో
# సర్వనాశనం

- వ్యవస్థలను దెబ్బతీసిన వైకాపా పాలన
- కొన్ని కంపెనీలు రాష్ట్రాన్ని వీడాయి
- ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ పూర్తిగా దెబ్బతింది
- ఒక్కో రంగాన్ని గాడిన పెడుతు వస్తున్నాం
- ఆర్థిక నివేదికను విడుదల చేసిన సీఎం చంద్రబాబు

**అమరావతి, ,డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వైకాపా ఐదేళ్ల పాలనలోఅభివృద్ధి ఆగిపోవడమే గాకుండా ఎపి బ్రాండ్ పూర్తిగా దెబ్బతిందని, ఆదాయం తగ్గిపోయిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్ని రంగాలు పూర్తిగా ధ్వసం అయ్యాయని, వ్యవస్థలు దెబ్బతిన్నాయని అన్నారు. వైకాపా పాలన దెబ్బకు ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ దెబ్బతిన్నది. ఆ పార్టీ చేసిన దారుణాల వల్ల కొన్ని కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయి. ఇప్పుడు అన్ని వ్యవస్థలను చక్కదిద్దుతూ అభివృద్ధి కొనసాగిస్తున్నాం అని వివరించారు. విధ్వంసమైన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. -మిగతా 2 లో

# థాయ్‌లాండ్-కంబోడియా సరిహద్దుల్లో మళ్లీ ఘర్షణలు..

- కంబోడియా పోస్టులు, ఆయుధ డిపోలే లక్ష్యంగా బాంబుల వర్షం
- ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం
- థాయ్ సైనికుడు మృతి


**న్యూఢిల్లీ,**
థాయ్‌లాండ్-కంబోడియ సరిహద్దులో మరోసారి ఘర్షణలు భగ్గుమన్నాయి. ఉబోన్ రాట్చథాని ప్రావిన్స్‌లో థాయ్ దళాలపై కంబోడియా దళాలు కాల్పులు జరిపారు. దీంతో థాయ్ సైన్యం వైమానిక దాడులకు దిగింది. కంబోడియా పోస్టులు, ఆయుధ డిపోలే లక్ష్యంగా బాంబుల వర్షం కురిపించారు. ఈ క్రమంలో సరిహద్దుల్లో మరోసారి ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో ఓ థాయ్ సైనికుడు మృతి చెందినట్లు థాయ్ సైన్యం వెల్లడించింది. ఈ ఘర్షణలకు సంబంధించి ఇరుపక్షాలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. కంబోడియా సైన్యం తొలుత దాడులను మొదలు పెట్టినట్లు థాయ్ అధికారులు చెబుతుండగా.. ఈ వాదనను కంబోడియా ఖండించింది. థాయ్ దళాలే తొలుత కాల్పులు జరిపినట్లు కంబోడియా రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది.కాగా, ఈ ఏడాది జులైలో థాయ్‌లాండ్, కంబోడియా మధ్య ఘర్షణలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. సరిహద్దుల పొడవున అనేక ప్రాంతాల్లో ఇరుదేశాలకు చెందిన సైనికుల మధ్య భీకర ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణలలో సైనికులతోపాటూ పౌరులు కూడా మరణించారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చడంతో ట్రంప్ రంగంలోకి దిగారు. కౌలాలంపుర్‌లో ఇరు దేశాల మధ్య సంధి కుదిర్చారు. ట్రంప్ సమక్షంలో థాయ్‌లాండ్-కంబోడియా దేశాలు శాంతి ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీంతో సరిహద్దుల్లో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. అయితే, ఐదు నెలల్లోనే మళ్లీ అక్కడ ఘర్షణలు చెలరేగడం ఆందోళన కలిగిస్తోంది.



# 2026 సంవత్సర సెలవులు జాబితా విడుదల

- వచ్చే ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 27 సాధారణ సెలవులు
- 26 ఐచ్ఛిక సెలవులను ప్రకటిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశాల మేరకు నోటిఫికేషన్‌ను విడుదల

**హైదరాబాద్, ,డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి సంబంధించిన సెలవుల వివరాలు విడుదల చేసింది. వచ్చే ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 27 సాధారణ సెలవులు , 26 ఐచ్ఛిక సెలవులను ప్రకటిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశాల -మిగతా 2 లో



నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
మంగళవారం 09 డిసెంబర్ 2025

## మాతృభూమి ఔన్నత్యాన్ని చాటేలా వందేమాతరం

మొదటి తరువాయి




డిఎంబర్ 2, 1905న రాశారు. బెంగాల్ స్వదేశీ ఉద్యమ సమయంలో బకించంద్ర రాసిన పాటను పాడటానికి లక్షలాది మంది ప్రజలు గుమిగూడి భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ పాట ఎంతగా ప్రాచుర్యం పొందింది అంటే.. ఈ గీతమే మన జాతీయ గీతంగా మారింది. ఈ పాట భావాలు గొప్పవి. ఇది ఇతర దేశాల పాటల కంటే తియ్యగా ఉంటుంది. దేశభక్తిని మేల్కొల్పడం దీని ఏకైక లక్ష్యం. ఇది భారతదేశాన్ని తల్లిగా చూస్తుంది' అని అన్నారు. రుగ్వేదంలోని శ్లోకాన్ని, రామాయణంలో రాముడు పలికిన వాక్యాలను ఈ సందర్భంగా ప్రధాని మోడీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. దేశమంటే మన మాతృభూమిగా కొలవడం అనాదిగా వస్తోందని, వందేమితర గీతానికి ఇవే ప్రేరణలని అన్నారు. లోక్‌సభలో వందేమాతరంపై జరుగుతున్న ప్రత్యేక చర్చ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కాంగ్రెస్ పార్టీపై, భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ గతంలో జాతీయ గీతాన్ని 'తుక్డే తుక్డే' చేసినట్టు ఆరోపించారు. అలాగే, వందేమాతరంతో ముస్లింలను రెచ్చగొట్టే విధంగా ఉందని నెహ్రూ పేర్కొన్నాడని చెప్పారు. సభలో 'షేమ్ షేమ్' నినాదాలు వినిపించినప్పటికీ, మోడీ వ్యాఖ్యానిస్తూ.. గత శతాబ్దంలో కొన్ని శక్తులు జాతీయ గీతానికి సర్వనాశనం చేశాయని పేర్కొన్నారు. ఆ చరిత్రను వచ్చే తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనదేనని ప్రధాని మోడీ అన్నారు. 1937లో మహమ్మద్ అలీ జిన్నా నేతృత్వంలోని ముస్లిం లీగ్ వందేమాతరానికి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించిందని ప్రధాని మోడీ గుర్తు చేశారు. అయితే, కాంగ్రెస్, నెహ్రూలు ఆ పోరాటాన్ని ఎదిరించ కుండా, వందేమాతరం పై విచారణకు ఆదేశాలు జారీ చేశారని విమర్శించారు. జిన్నా ఆందోళన తరువాత సుభాష్ చంద్ర బోస్‌కు నెహ్రూ రాసిన లేఖలో- వందేమాతరం మొత్తం చదివిన తరువాత అది ముస్లింలను రెచ్చగొట్టేలా ఉందని భావిస్తున్నానని ఆయన వెల్లడించారు. అలాగే, అత్యవసర పరిస్థితి కాలాన్ని గుర్తు చేసుకుంటూ.. వందేమాతరం 50 సంవత్సరాలు పూర్తయ్యే సమయానికి దేశం మొత్తం బ్రిటిష్ వారి పాలనలో ఉండగా.. 100 ఏళు పూర్తి అయ్యే సమయానికి దేశంలో అత్యవసర పరిస్థితి దేశాన్ని కబలించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను జైలులో పెట్టిన ఆ కాలం భారత చరిత్రలో బ్లాక్ డేస్ గుర్తించబడిందని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. అయితే, వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆ గీతానికి గౌరవం తిరిగి తీసుకురావాల్సిన సమయం ఇదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. 1875లో బంకిమ్ చంద్ర చట్టోపాధ్యాయ రచించిన ఈ గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరిగా నిలిచిందని ప్రశంసించారు. వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో పార్లమెంట్ ఉభయ సభల్లో 10 గంటల ప్రత్యేక చర్చను ఏర్పాటు చేసింది.

## రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్

మొదటి తరువాయి

విమర్శలు చేశారు. పార్టీ నేతలతో కలిసి రేవంత్ రెండేండ్ల పాలనపై తెలంగాణ భవన్‌లో హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. 'రేవంత్ పాలనలో రెండేళ్లుగా దోపిడీ తప్ప పారదర్శకత లేదు. ఆత్మస్తుతి, పరనింద తప్ప రేవంత్ రెండేండ్లలో చేసిందేమీ లేదు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారు. రెండేండ్ల పాలనలో రాష్ట్ర ఆదాయం ఎందుకు తగ్గింది?. ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు చేశాం. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో తెలంగాణను నంబర్ వన్‌గా నిలబెట్టాం. ఎన్నో కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని అన్నారు. ప్రతీరోజు ప్రజల్ని కలుస్తానని రేవంత్ రెడ్డి మేనిఫెస్టోలో చెప్పారు. రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఒక్క రోజు మాత్రమే ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నాడు. నాలుగైదు రోజులు మంత్రులు వచ్చారు.. ఆ తర్వాత వాళ్లు కూడా పత్తా లేరు. ఆ దరఖాస్తులను పట్టించుకున్న నాథుడే లేడు. మేనిఫెస్టోలోని మొదటి కార్యక్రమం, రేవంత్ రెడ్డి మొదటి మాటే తుస్సుమంది. ప్రజా భవన్‌ను జల్సాలకు, విందులకు, వినోదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారు. పొద్దుగాల బ్రేక్‌ఫాస్ట్ మీటింగులు.. మధ్యాహ్నం సెటిల్‌మెంట్లు.. సాయంత్రం గానా భజానాలు, సంగీత్‌లు, ఎంగేజ్‌మెంట్లు, విందులు వినోదాలు జరుగుతున్నాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన గొడుగు నాగరాజు అనే రైతు తనకు సమస్య ఉందని ప్రజా భవన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. అతని ఫోన్‌కు సమస్య పరిష్కారం అయిందని మెసేజ్ వచ్చింది.. కానీ ఇప్పటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదు. కేసీఆర్ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా తీర్చి దిద్దితే, రేవంత్ రెడ్డి తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నాడు. కేసీఆర్ ప్రతి ఊరికి పల్లె దవాఖానాలు, పెద్ద పెద్ద ప్రభుత్వ హాస్పిటళ్లు కడితే, రేవంత్ రెడ్డి ప్రతి ఊరికి ఒక బారు, పబ్ పెట్టుకోమని చెప్తున్నాడు. ఐటీఐకి, ఐఐటీ, ఐఐఐటీకి తేడా కూడా తెలియని మూర్ఖుడు ఈరోజు ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్నాడు. కల్యాణలక్ష్మి చెక్కులు తీసుకునేందుకు మహిళలు వారి పిల్లలతో వస్తున్నారు. పెళ్లికి సహాయం చేస్తున్నావా లేక పిల్లల 21వ రోజుకు సహాయం చేస్తున్నావా?. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకానికి ఇవ్వాల్సిన రూ.980 కోట్ల నిధులు పెండింగ్‌లో పెట్టింది. అవినీతి ఎలా చేయాలో కాంగ్రెస్ పాలన చూసి నేర్చుకోవాలి. కరప్షన్ నేర్పడానికి కాలేజీ పెడితే.. తెలంగాణ కాంగ్రెస్ కరప్షన్ పాలనను ఒక సిలబస్ మోడల్‌గా పెట్టొచ్చు. ÷నాన్స్‌లో బిల్లు రావాలి అంటే 30 శాతం ఇవ్వాలి. భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్, ఉత్తమ్, ఆర్ఆర్ ట్యాక్స్ తీసుకువచ్చారు. వ్యవస్థీకృత అవినీతికి కాంగ్రెస్ అధిష్టానం బాధ్యత వహించాలి. రెండేండ్లలో నువ్వు జర్నలిస్టులకు చేసింది ఏందన్నారు. . ఒక్క అక్రిడేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. జర్నలిస్టుల సంక్షేమాలకు ఒక్క రూపాయి అయినా ఇచ్చావా' అని హరీశ్ రావు దుయ్యబట్టారు.

## 2026 సంవత్సర సెలవులు జాబితా విడుదల

మొదటి తరువాయి

మేరకు జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2026 సంవత్సరంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు అధికారిక ఉత్తర్వులలో పేర్కొన్న మొత్తం 27 సాధారణ సెలవు దినాలలో మూసివేయబడతాయి. దీంతో పాటు ప్రతి నెలలోని ఆదివారాలు, రెండవ శనివారాలు యథావిధిగా సెలవు దినాలుగా కొనసాగుతాయి.

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన సాధారణ సెలవులు..

సంక్రాంతి (జనవరి 15), గణతంత్ర దినోత్సవం (జనవరి 26) ,హోలీ (మార్చి 3) ,ఉగాది (మార్చి 19) ఈదుల్ ఫితర్/రంజాన్ (మార్చి 21) ,శ్రీ రామ నవమి (మార్చి 27) డా.బి.ఆర్. అంబేద్కర్ జయంతి (ఏప్రిల్ 14) ,ఈదుల్ అజహా/బక్రీద్ (మే 27) ,బోనాలు (ఆగస్టు 10) ,స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15) ,వినాయక చవితి (సెప్టెంబర్ 14) ,విజయ దశమి/దసరా (అక్టోబర్ 20) ,దీపావళి (నవంబర్ 8) ,క్రిస్మస్ (డిసెంబర్ 25).

# తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్

మొదటి తరువాయి

పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల నుంచి ఆలోచనలు, అభిప్రాయాలు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూడా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10శాతం ఉండాలనేది తమ ఆశయమన్నారు. లక్ష్యం పెద్దది అయినప్పటికీ కష్టపడి సాధిస్తామనే నమ్మకం మాకుంది. అందరి సహకారంతో మా లక్ష్యాన్ని అందుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో తెలంగాణ భవిష్యత్ విజన్‌ను స్పష్టంగా వివరించారు. దేశ భవిష్యత్ కోసం రాజ్యాంగ సభ ఏర్పాటు చేసి భారత రాజ్యాంగ నిర్మాతల దృష్టిని గౌరవించడం చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలే తెలంగాణ అభివృద్ధి మార్గదర్శకాలని ఆయన అన్నారు. విడిపోయిన తర్వాత ప్రజా పోరాటంతో సాధించిన ప్రత్యేక రాష్ట్రం తెలంగాణ 2014లో సోనియా గాంధీ, డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలో భారత పటంలో చోటు చేసుకుందని గుర్తు చేశారు. గత దశాబ్దంలో రాష్ట్రం అత్యధిక అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగిందన్నారు. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికల కోసం నిపుణుల కమిటీ ఏర్పాటుతో 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్'ను సిద్ధం చేసినట్లు సీఎం వెల్లడించారు. ఈ డాక్యుమెంట్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబించేలా రూపొందించబడిందని, నీతి ఆయోగ్, నిపుణుల సూచనలు ప్రధాన పాత్ర పోషించాయని చెప్పారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగడం ముఖ్య లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ జనాభాలో 2.9 శాతమే ఉన్నా.. దేశ జిడిపిలో 5 శాతం వాటా సాధించిన తెలంగాణ 2047 నాటికి దాన్ని 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. రాష్ట్ర అభివృద్ధి కోసం మొదటిసారి క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్ల అభివృద్ధి మోడల్‌ను అమలు చేస్తున్నామన్నారు. చైనా గ్వాంగ్‌డాంగ్ మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని.. జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ వంటి దేశాల పోటీ స్థాయికి తెలంగాణను తీసుకెళ్లే ప్రణాళిక ఉందని ఆయన తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో గ్లోబల్ ఇన్వెస్టర్లు కీలక భాగస్వాములని.. వారికి ఈ సందర్భంగా ఆహ్వానం పలుకుతున్నట్లు సీఎం అన్నారు. కష్టం అయితే వెంటనే చేయండి.. అసాధ్యమైతే డెడ్‌లైన్ పెంచుతాం అని సందేశం ఇచ్చారు. ఏ రాష్ట్రం చేయని విధంగా రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించాం. వాటిని సేవ, తయారీ, వ్యవసాయ రంగాలకు కేటాయించాం. క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా పిలుచుకుంటున్నాం. ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో సహకరించిన వారందరికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల సూచనలను ఆహ్వానిస్తున్నామన్నారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం మన నాయకులు కొత్త రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా భవిష్యత్తుకు రోడ్ మ్యాప్ వేశారని వివరించారు. అలాగే తాము సైతం తెలంగాణ భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలనుకున్నామన్నారు. తెలంగాణ ప్రజలు దశాబ్దాలుగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని గుర్తు చేశారు. రానున్న పదేళ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, ప్రపంచంలోనే ఉన్నత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశానికి స్వాతంత్రం సిద్ధించి.. 2047లో వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని.. నాటికి మనం ఏం సాధించామో చెప్పాలని నిపుణులను కోరినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ సమయంలోనే తెలంగాణ రైజింగ్-2047 దార్శనికతకు బీజం పడిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. మనమేదైనా గొప్పగా చేయాలని భావించినప్పుడు తెలంగాణ సంస్కృతిలో ముందుగా దేవుళ్ల ఆశీర్వాదం తీసుకుంటాం? ప్రజల మద్దతు కోరుతామన్నారు. భవిష్యత్తు కోసం మన కలలు నెరవేర్చుకోవడానికి ప్రజల ఆలోచనలు, అంచనాలు తెలుసుకున్నామన్నారు. అందుకు అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, నీతి ఆయోగ్ నిపుణుల సహాయం తీసుకున్నామన్నారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రంగాలకు చెందిన ప్రతినిధులు రావడం మన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వ్యాపారవేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు, విధాన నిర్ణేతలు, దౌత్యవేత్తలు, ప్రభుత్వ అధికారులతోపాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులకు సీఎం రేవంత్ ధన్యవాదాలు చెప్పారు. ఈ సమ్మిట్‌లో మీ సూచనలు, సలహాలు, అభిప్రాయాలను స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణలో అపారమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. మంచి సానుకూల వాతావరణం కూడా ఉందన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న రాష్ట్రాన్ని.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని తాము సంకల్పించామని చెప్పారు. దేశంలో తెలంగాణ దాదాపు 2.9శాతం జనాభా కలిగి ఉందని గుర్తు చేశారు. దేశ జీడీపీలో తెలంగాణ నుంచి దాదాపు 5శాతం వాటాను అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి భారత దేశ జీడీపీలో 10 శాతం వాటాను తెలంగాణ నుంచి అందించాలన్నది తమ లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు. సేవారంగం, తయారీ రంగం, వ్యవసాయ రంగం.. ఇలా తెలంగాణను మూడు భాగాలుగా విభజించి.. ప్రాంతాల వారీగా అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశిరచు కున్నామని వివరించారు. ఇలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే మొట్టమొదటిదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అందుకోసం కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ మోడల్స్ నిర్దేశించామని చెప్పారు. ఈ సందర్భంగా చైనాలోని గ్వాంగ్-డాంగ్ ప్రావిన్స్ సాధించిన అభివృద్ధి గురించి సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. చైనాలోనే ఈ ప్రావిన్స్ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అని తెలిపారు. 20 ఏళ్లలో వారు ప్రపంచంలోనే అత్యధిక పెట్టుబడులతోపాటు వృద్ధి రేటు సాధించారని వివరించారు. తెలంగాణలో సైతం తాము అదే నమూనాను అనుసరించాలని భావిస్తున్నామని చెప్పారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాల నుంచి తామేంతో ప్రేరణ పొందామన్నారు. ప్రస్తుతం ఆయా దేశాలతో తాము పోటీ పడాలనుకుంటున్నామని తెలిపారు. ఈ విజన్ కష్టంగా అనిపించవచ్చు.. కానీ ఆ విజన్‌ను సాధించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ విషయంలో తమ టీమ్‌కు తాను చెప్పేదొక్కటేనన్నారు. కష్టంగా ఉంటే..వెంటనే చేపడుదాం. అసాధ్యం అని అనుకుంటే.. వారికి కొంత గడువు ఇస్తానని పేర్కొన్నారు. ఇవాళ తాను నిన్నటి కంటే ఎక్కువ విశ్వాసంతో, నమ్మకంతో ఉన్నానన్నారు. నిన్నటిది ఒక కల, ఒక ప్రణాళిక? ఇవాళ మీరందరూ తమతో చేరారని.. ఈ ప్రయాణంలో భాగస్వాములుగా ఉండాలని ఆశిస్తున్నామన్నారు. మీ అందరి మద్దతుతో తెలంగాణ రైజింగ్ లక్ష్యాలన్నింటినీ సాధించగలమని బలంగా విశ్వసిస్తున్నానన్నారు. ఈ తెలంగాణ రైజింగ్ నిరంతర ప్రక్రియ..అంటూ సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తూ.. తన ప్రసంగాన్ని ముగించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం అనంతరం ఈ సమ్మిట్ ప్రారంభ వేడుకలు ముగిశాయి. ఆనంతరం వివిధ రంగాలపై సదస్సులు ప్రారంభమైనాయి. సెమీకండక్టర్ రంగంపై చర్చలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. విద్యా రంగంలో గ్లోబల్ సెంటర్‌గా తెలంగాణ చర్చ గోష్టిలో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు.

# హైదరాబాద్ దేశ అర్థిక వ్యవస్థకు మూలస్తంభం

మొదటి తరువాయి

సాకారమవుతుందని ఆయన అన్నారు. హైదరాబాద్ వేదికగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఘనంగా మొదలైంది. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అనేక విషయాలపై మాట్లాడారు. హైదరాబాద్ నగరం అంటేనే సాంకేతికతో సంప్రదాయం, శాస్త్ర పరిజ్ఞానంతో ఆధ్యాత్మికత, వారసత్వ సంపదతో సృజనాత్మకత కలగలిసి ఉంటాయని అన్నారు. తెలంగాణ ఏర్పడిన 2014లోనే మార్పు, పారదర్శకత నినాదంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. ఆయన అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా భారత్ అవతరించింది. పేదరిక నిర్మూలన, డిజిటల్ సాధికారత, వడివడిగా మౌలికవసతుల కల్పన, రైతుల సంక్షేమం, స్టార్టప్స్ కు ప్రోత్సాహం ఇలా అన్ని రంగాల్లో మున్ముందుకు సాగిపోతోందన్నారు. పరిశ్రమలను, స్టార్టప్స్ ను, టాలెంట్ ను, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే విషయంలో రాష్ట్రాలు పోటీ పడాలి. రాష్ట్రాల మధ్య సుహృద్భావ పోటీతోనే ప్రమాణాలు పెరగడంతో పాటు సంస్కరణలకు వీలు కలుగుతుందని.. తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలియచేశారు. 2014 నుంచి 25 వరకు 748.78 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు దశాబ్దంతో పోలిస్తే ఏకంగా 143 శాతం వృద్ధి నమోదు కావడం విశేషం. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతి రహిత పాలన పెరిగింది. దీంతో పెట్టబడిదారుల్లో నమ్మకం పెరిగింది. భారత్‌ను పెట్టుబడులకు సురక్షితమైన దేశంగా అంతర్జాతీయ పెట్టుబడిదారులు భావిస్తున్నారు. 'ఆత్మ నిర్భర్ భారత్', 'మేకిన్ ఇండియా' ద్వారా భారత్ మొబైల్ ఫోన్ల తయారీ రంగంలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా అవతరించింది. 2014లో రెండు యూనిట్లు ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య ఏకంగా 300 యూనిట్లకు పెరిగింది. రక్షణ రంగం ఎగుమతులు 2013-14లో రూ.686 కోట్లు ఉండగా, ఇప్పుడు 34 రెట్లు పెరిగి ఏకంగా రూ.23,622 కోట్లకు ఎగబాకాయి. ఆపరేషనల్ ఎయిర్ పోర్టులు 2014లో 74 ఉండగా, ఇప్పుడు అది రెట్టింపై 160కి పెరిగాయి. రైల్వే క్యాపిటల్ పెట్టుబడులు, మెట్రో నెట్ వర్క్ భారీగా పెరిగాయి. గత పదేళ్లలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంది. గ్లోబల్ నార్త్, గ్లోబల్ సౌత్ కు మధ్య వారధిగా, పెద్దన్న పాత్ర పోషిస్తోందని వివరించారు. 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పన్నుల, గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల రూపంలో రూ.10లక్షల కోట్లకు పైగా నిధులను అందించింది. తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.1.5 లక్షల కోట్లు కేటాయించి, కారిడార్లు, రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారులు, ఎకనామిక్ కారిడార్లను కేంద్ర ప్రభుత్వం నిర్మించిందన్నారు. రైల్వే కొత్త లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులు, ఎలక్ట్రిఫికేషన్, సిగ్నలింగ్ వంటి పనుల కోసం రూ.32 వేల కోట్లు కేటాయించింది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తెలంగాణలో రూ.2,500 కోట్లతో 42 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తోంది. రూ.521 కోట్లతో కాజీపేటలో రైల్వే మానుఫ్యాక్చరింగ్ యూనిట్ తొలి దశ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. రామగుండంలో రూ.11 వేల కోట్లతో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 1600 మెగావాట్ల కొత్త థర్మల్ పవర్ ఎలాంటు నిర్మించాం. మరో 2400 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఎలాంట్లు నిర్మించేందుకు ఎన్టీపీసీ సిద్ధంగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు.

## ఐదేళ్ల జగన్ పాలనలో సర్వనాశనం

మొదటి తరువాయి

టీడీపీ అనేక విజయాలను చవిచూసిందని.. కానీ 2024 విజయం.. నమ్మకం, విశ్వాసం మీద వచ్చిందని తెలిపారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామన్నారు. పరీక్ష రాసినప్పుడు పిల్లలు ఎంత టెన్షన్‌గా ఉంటారో తాము అంతే టెన్షన్‌గా ఉంటామని చెప్పుకొచ్చారు. జీఎస్డీపీ విషయంలో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటున్నామని తెలిపారు.ఈ రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టగలు గుతారా? అనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని.. అయితే ప్రస్తుత పరిస్థితి చూసి పారిపోమని ప్రజలకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.ప్రస్తుతం ఓ వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ.. ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం కేంద్ర పథకాల్లో అవకతవకలకు పాల్పడిందని, కేంద్ర నిధులను ఇతర పథకాలకు మళ్లించిందని అన్నారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం గతంలో రూ.9వేల కోట్లు ఖర్చు చేశారు. ఇప్పుడు విద్యుత్ ఛార్జీలు పెంచకుండానే విద్యుత్ రంగాన్ని సమర్థంగా నిలబెడుతున్నాం అని అన్నారు. వచ్చే ఏడాది కూడా విద్యుత్ రంగంలో సమర్థత పెంచుకుంటాం. సాగు నీటి పంట గుంటలు తవ్వడంతోపాటు, చెక్ డ్యామ్‌లు కట్టాం. ఇంగ్లీష్ మీడియం పేరుతో విద్యా వ్యవస్థలో కూడా గతంలో డ్రామాలు చేశారు. విద్యా వ్యవస్థలోని బిల్లులు అన్నీ పెండింగ్‌లో పెట్టారు. వైకాపా ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చి వెళ్లిందని చంద్రబాబు దుయ్యబట్టారు.ప్రతి త్రైమాసిక, ఆర్థిక ఏడాది రాష్ట్ర స్థూల ఉత్పత్తి పర్యవేక్షిస్తున్నాం. ప్రజల కోసం ఎంత కష్టమైనా సరే బాధ్యత తీసుకొని అభివృద్ధి చేస్తాం. ఆస్తులు, భవిష్యత్ ఆదాయాన్ని తాకట్టు పెట్టి గతంలో అప్పులు తెచ్చారు. మూలధన వ్యయం చేయకపోవడంతో గతంలో ప్రాజెక్టులు ముందుకెళ్లలేదు. కూటమి అధికారంలోకి వచ్చాకే స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రాజెక్టులపై మూలధన వ్యయం పెంచి ప్రాజెక్టులు చేపట్టాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజల చేతుల్లోకి పాలన తీసుకెళ్లాం. వైకాపా హయాంలో పీపీఏల రద్దుతో విద్యుత్ వాడకుండానే రూ.9 వేల కోట్లు వ్యయం చేశారు. కక్షపూరిత రాజకీయాలతో గత పాలకు ప్రజాధనాన్ని వృథా చేశారు. 2014-19 మధ్య 13.5 శాతంగా వృద్ధిరేటు ఉండేది. 2019-24 మధ్య కాలంలో అది 10.32 శాతానికి పడిపోయింది. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సంస్కరణలు తెచ్చాం. పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం అని చంద్రబాబు తెలిపారు.

## వందేమాతరంపై ఇప్పుడే ఎందుకు చర్చ?

మొదటి తరువాయి

చర్చిస్తోందని ఆమె ఆరోపించారు. వాస్తవానికి వందేమాతరం ప్రస్తావన వచ్చినప్పుడు, మనకు చరిత్ర గుర్తుకు వస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒకప్పటి ప్రధానిగా కనిపించడం లేదు. ఆయన మంచి ప్రసంగాలు చేస్తారు, కానీ వాస్తవాలను అర్థం చేసుకోరు. మోడీ ప్రజలకు వాస్తవాలను అందించే విధానం ఆయన నైపుణ్యానికి నిదర్శనం. కానీ నేను ప్రజా ప్రతినిధిని ? కళాకారుడిని కాదు' అని ప్రియాంక గాంధీ అన్నారు. వందేమాతరం గురించి ప్రస్తావించినప్పుడు, మనకు మొత్తం చరిత్ర గుర్తుకు వస్తుందని, అది స్వాతంత్ర్య పోరాట చరిత్ర, స్వేచ్ఛ కోసం పోరాటం, నైతికత, బ్రిటిష్ సామ్రాజ్య పతనం గుర్తుకు వస్తుందన్నారు. వందేమాతరం భారతదేశ ప్రజలను రాజకీయ, నైతిక ఆకాంక్షతో అనుసంధా నించిందని అన్నారు. వందేమాతరం నిద్రపోతున్న భారతదేశాన్ని మేల్కొలిపిందని, దానిపై ఈ రోజు చర్చ వింతగా అనిపిస్తుందని చెప్పారు. ఇంతకీ ఈ రోజు ఈ చర్చ అవసరం ఏమిటి, దీని ఉద్దేశ్యం ఏమిటి? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం భవిష్యత్తు వైపు చూడాలని అనుకోకుండా, మనల్ని గతంలోకి లాగడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. నిజం ఏమిటంటే నేడు ఉన్న ప్రధాన మంత్రి మోడీ ఒకప్పటి ప్రధానిగా లేరని, ప్రస్తుత ఆయన విధానాలు దేశాన్ని బలహీనపరుస్తున్నాయని అన్నారు. నేడు దేశ ప్రజలు సంతోషంగా లేరని, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిత్యం ప్రజలు అనేక సమస్యలతో పోరాడుతున్నారని, ప్రభుత్వం వాటికి పరిష్కారాలను కనుగొనడం లేదని అన్నారు. కొందరి కారణంగా దేశానికి హాని జరుగుతోందని అన్నారు. అందుకే ఈ రోజు వందేమాతరం గురించి చర్చిస్తున్నామని, వాస్తవానికి దేశంలోని ప్రతి అణువులో వందేమాతరం సజీవంగా ఉందని, దాని గురించి చర్చించకూడదని స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై ఒత్తిడి తేకుండా దేశం దృష్టిని మళ్లించాలని ఈ ప్రభుత్వం వందేమాతరం పై చర్చ పెట్టి కోరుకుంటోందని ప్రియాంక గాంధీ అన్నారు. వందేమాతరం స్వభావాన్ని ప్రశ్నించడం దానికి సంబంధించి నిర్ణయాలు తీసుకున్న గొప్ప వ్యక్తులను అవమానించడమే ఈ చర్చ ఉద్దేశమని విమర్శించారు.

# మీ ఓటే ప్రశ్నించే గొంతు కావాలి



**పెద్దపల్లి, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో "నేను తప్పక ఓటు వేస్తాను, మీరు కూడ ఓటు వేయండి! కాని డబ్బుకు ప్రలోబపడి కాదు, మీ ఓటే ప్రశ్నించే గొంతు కావాలి" అనే నినాదంతో వాల్ పోస్టర్లు ముద్రించి ఎలిగేడు మండలం నారాయణపల్లె గ్రామంలోని వివిధ ప్రదేశాల్లో అంటించారు.సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ పటేల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రతి ఓటరు దానిని వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నీతి నిజాయితీగల నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ధనపురి సాగర్, కోశాధికారి తోడుపునూరి తిరుపతి, గ్రామస్తులు కిరణ్, సంపత్ రెడ్డి, సుంకే సందీప్, కార్తీక్ అర్జున్, రమేష్, సుంకే రజిత, రిషిత, సుగుణ, శకుంతల, మానస, సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పాస్టర్ అసోసియేషన్ క్రిస్మస్ వేడుకలు



**నల్లగొండ ,డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్స్ ఫ్యామిలీస్ క్రిస్మస్ వేడుకలు సోమవారం హైదరాబాద్ రోడ్ లోని న్యూ లైఫ్ ఆగపే చర్చిలోరెవరెండ్ కన్నా డేవిడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంను పురస్కరించి బిషప్ సమర్పణ కుమార్ గారు వాక్య సందేశం అందించారు క్రిస్టమస్ యావత్ ప్రపంచ దేశాలు జరుపుకునే పండుగ అని సర్వలోక పాప పరిహార్థమై యేసు ప్రభువు లోకరక్షకుడిగా వచ్చారని బైబిల్ బోధిస్తూనాది అని చెప్పారు .నల్లగొండ పాస్టర్ అసోసియేషన్ పాస్టర్లు వారి కుటుంబాలుగా కూడుకుని క్రిస్టమస్ సంబరాలు జరుపుకున్నారు, చిన్నపిల్లలు నృత్యాలు పెద్దలు స్కిట్స్ వేసారు. పాస్టర్ల కుటుంబ సభ్యులు కలుసుకొని క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు అనంతరం పాటలు పాడుతూ క్రోవతులు వెలిగించి కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బిషప్ సుధీర్ కుమార్, రెవరెండ్ కన్నా డేవిడ్, రేవరేండ్ కట్ట మోజెస్, రేవు ప్రసాద్, జాన్ శాస్త్రి, రెవరెండ్ లాజరస్, జి సాల్మన్, ఐజాక్ రాము, బిషప్ ఝూన్సీ రాణి, జయ చందర్, దీవెన, ప్రసన్న, రూతు, కృప తదితరులు పాల్గొన్నారు

# పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో యువతికి విజయవంతమైన శస్త్రచికిత్స



**పెద్దపల్లి, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన 28 ఏళ్ల యువతి శనివారం సాయంత్రం తీవ్రమైన కడుపు నొప్పి, రక్తస్రావంతో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో చేరారు. రెండు రోజుల చికిత్స అనంతరం సోమవారం స్కానింగ్‌లో అండాశయం మెలికపడినట్లు గుర్తించి వైద్యులు వెంటనే శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ ఆపరేషన్ విజయవంతమై ఆమెను ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. శస్త్రచికిత్స చేసిన డాక్టర్ స్రవంతి, డాక్టర్ భవానిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. ఎలాంటి శస్త్రచికిత్సలయినా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన ప్రకటనలో తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



**కరీంనగర్, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, డిపిఓ ఎన్ హెచ్ ఎం స్వామితో కలిసి తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్, అవుట్‌పేషెంట్ రికార్డులు, ఎన్‌సిడీ క్లినిక్‌లో అసంక్రామిత వ్యాధిగ్రస్తుల వివరాలు, వారికి అందిస్తున్న మందుల విధానం పరిశీలించారు. ఫార్మసీ స్టోర్లలో సీజనల్ వ్యాధుల మందుల నిల్వలు, పిల్లల టీకాల కోసం ఐఎల్‌ఆర్‌లో ఉంచిన నిల్వలు, రోజువారీ టెంపరేచర్ రికార్డులు, ఐఇసి బోర్డులో ప్రదర్శించిన అధిక రక్తపోటు, షుగర్ మందుల వివరాలను పరిశీలించారు.ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో రీస్క్రీనింగ్ 100% పూర్తి చేసి ఫాలోఅప్ చేయాలని సూచించారు. ప్రసూతి గది పరిశుభ్రత, అత్యవసర మందుల లభ్యతను పరిశీలించారు. గర్భవతులతో మాట్లాడుతూ క్రమబద్ధంగా పరీక్షలు చేయించుకోవాలని, సిజేరియన్ వల్ల కలిగే సమస్యలను నివారించేందుకు సాధారణ డెలివరీలు ప్రోత్సహించాలని సూచించారు.ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బందితో సమావేశమై నార్మల్ డెలివరీలను మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రిసిల్లా, సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దపల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక



**పెద్దపల్లి, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ జర్నలిస్టు బుర్ర సంపత్ కుమార్ గౌడ్ ప్రధాన ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, పూర్వ అధ్యక్షుడు చింతకింది చంద్రమొగిలి, ముఖ్య అతిథి వడ్డేపల్లి రవీందర్ సమక్షంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా నారాయణదాస్ అశోక్, ప్రధాన కార్యదర్శిగా పోగుల విజయ్‌కుమార్, కోశాధికారిగా వీరమల్ల విద్యాసాగర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా ఆకుల రమేష్, కొండ లింగమూర్తి యాదవ్, ఈదునూరి జయపాల్, సహాయ కార్యదర్శులుగా నాగులమల్యాల శివ కోటయ్యచారి, కొమిరిశెట్టి శ్రీనివాస్, మోదుంపల్లి సాగర్, సభ్యులుగా అడిచెర్ల రమేష్, ముత్యాల కృష్ణమూర్తి, కొలిపాక కృష్ణ, తిరుమల సురేష్, సయ్యద్ నసీర్, సుంక మహేష్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా ముస్త్యాల రవి కిషోర్, బుర్ర సంపత్ కుమార్, చింతకింది చంద్రమొగిలి, వడ్డేపల్లి రవీందర్ ఎంపికయ్యారు. నూతన అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ సభ్యుల సహకారంతో క్లబ్ కార్యకలాపాలను బలోపేతం చేస్తామని, జర్నలిస్టుల సంక్షేమం, ఇండ్లు, స్థలాలు, ఆరోగ్య బీమా వంటి హక్కుల సాధన కోసం పోరాటంలో ముందుంటామని తెలిపారు. త్వరలోనే కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయాలు తీసుకుంటామని ప్రకటించారు.ఈ సందర్భంగా సభ్యులు నూతన కార్యవర్గాన్ని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# తపస్ కరీంనగర్ జిల్లా నూతన అధ్యక్ష

## ప్రధాన కార్యదర్శుల ఏకగ్రీవ ఎన్నిక





**కరీంనగర్, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కరీంనగర్ జిల్లా కార్యనిర్వాహకవర్గ సమావేశం స్థానిక మంకమ్మ తోటలోని పారామిత హైస్కూల్‌లో జిల్లా అధ్యక్షుడు కట్ట రాజేశ్వర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై చర్చించి, 2023 జూలైలో రావాల్సిన పిఆర్సిని వెంటనే ప్రకటించాలని, 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని, గ్రామపంచాయతీ ఎన్నికలలో అనారోగ్యంతో బాధపడుతున్న దివ్యాంగ ఉపాధ్యాయులకు విధుల నుండి మినహాయింపులు ఇవ్వాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్ధతి కింద వేతనాలు చెల్లించాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస టైమ్ స్కేల్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. తదనంతరం 2025 -2028 కాలానికి సంబంధించి నూతన జిల్లా అధ్యక్షుడిగా అన్నమనేని తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శిగా జారతి నర్సయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియలో జిల్లా ఎన్నికల అధికారి అంబటి వేణు కుమార్, జోనల్ ఎన్నికల అధికారులు గడ్డం మహిపాల్ రెడ్డి, కుమ్మరి కుంట సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి వడ్నాల జగన్మోహన్, వీరమల్ల వెంకటరమణారావు, కటకం శ్రీనివాస్, సంఘ పెద్దలు ఎన్నమనేని అశోక్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.నూతన అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి జారతి నర్సయ్యలు మాట్లాడుతూ, ఉపాధ్యాయ మిత్రులు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, సంఘ విస్తరణకు శాయశక్తులా పనిచేస్తామని హామీ ఇచ్చారు. తమ ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# పంచాయతీ ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి



**పాలకుర్తి, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామపంచాయతీ ఎన్నికల విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. సోమవారం ఆయన రెండవ విడత పోలింగ్ జరగనున్న జూలపల్లి, ధర్మారం, అంతర్గాం, పాలకుర్తి మండలాల ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాలకుర్తి మండలంలోని రిక్రియేషన్ క్లబ్‌ను సందర్శించి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. డిసెంబర్ 9న పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమం క్రమబద్ధంగా జరగాలని, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎంపీడీవో కార్యాలయంలో ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించే సమయంలో ఫారం 14, ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ వెంట తీసుకురావాలని, రెండవ విడత పోలింగ్ సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ, పంపిణీ నిబంధనల ప్రకారం సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో ఎంపీడీవోలు, ఎంవోళ్లు, సంబంధిత అధికారులు కలెక్టర్‌తో పాటు ఉన్నారు.

# మహేశ్వరం పెద్దపులి నాగారం గ్రామంలో కాంగ్రెస్ సభ



**మహేశ్వరం, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహేశ్వరం మండలం పెద్దపులి నాగారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల మాజీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ కావలి దశరథ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన కృషిని గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గ్రామపంచాయతీ కార్యాలయం నిర్మాణం, 69 బోర్లలో 59 బోర్లకు నీటి సరఫరా, ప్రతి గల్లీకి సిసి రోడ్లు, గ్రామ దేవతల మందిరాలు, పీర్ల కోటాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వంటి పనులు చేపట్టినట్లు వివరించారు.కులమతాలకు అతీతంగా ప్రతి పేదవాడికి 60 గజాల ప్లాటు పట్టాలు అందజేసిన విషయాన్ని గుర్తుచేసి, ఇప్పటివరకు దానిపై ఎవరూ స్పందించలేదని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చినందున ప్రతి పేదవాడికి 60 గజాల ప్లాటు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు గ్రామంలో 50కి పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ఇకపై 150 ఇళ్లు కట్టుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే మంజూరు చేయిస్తానని తెలిపారు."నేను మాటలతో చెప్పే వ్యక్తిని కాదు, పని చేసి చూపించే వ్యక్తిని" అని స్పష్టం చేసిన కావలి దశరథ, గ్రామ ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కుండే ఈశ్వరయ్యను గెలిపించి అభివృద్ధి సాధించాలంటూ విజ్ఞప్తి చేశారు.

# మక్తమాదారంలో దుసుకెళ్తున్న ఉంగరం..!

-- జనం బాలరాజు వైపే, సర్పంచ్ గెలవడం కాయమంటున్నా ప్రజలు





**కడ్తాల్, డిసెంబర్ 8 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** : కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అర్కోటం బాల్ రాజు ప్రచారంలో దుసుకెళ్లుతున్నారు. అయనకు ఉంగరం గుర్తు కేటాయించడంతో ప్రజల్లో తమ గుర్తును ప్రజలకు పరిచయం చేస్తూ ప్రచారం మమ్మరం చేశారు. గ్రామంతో పాటు వేణుగోపాలస్వామి కాలనిలో మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహాతో కలిసి ప్రచారం చేశారు. అదే విదంగా గ్రామంలో అన్ని విధులు తిరుగుతూ ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ రాష్టంలో అధికారంలో ఉందని స్థానికంగా ఉంగరం గెలిస్తే గ్రామం మరింత అభివృద్ధి బాట పెట్టానుందని ఓటర్లను కోరారు.

# మహిళాపట్ల అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్



**కడ్తాల్, డిసెంబర్ 8 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** ఓ మహిళా పట్ల అనుచిత వాక్యాలు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన కడ్తాల్ మండలం పల్లెచేలుక తండాలో చోటు చేసుకుంది. సోమవారం సిఐ గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 2న పల్లెచేలుక తండాలో ఓ మహిళపై అదే తండాకు చెందిన విస్లావత్ శంకర్ అను అతను మహిళపై అనుచిత వాక్యాలు చేయడంతో మహిళా పోలీసులకు పిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు.

# రాజన్న సిరిసిల్లలో బిజెపిలో చేరికలు







**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వేములవాడ నియోజకవర్గం కొనరావుపేట మండలం పల్లె నిజామాబాద్ గ్రామానికి చెందిన స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి బంటు నవీన్, చాంద్ పాషా బిజెపిలో చేరారు. వీరిని జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి సమక్షంలో పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లె నిజామాబాద్ కేంద్రం ఇంచార్జి దుర్గం తిరుపతి, బూత్ అధ్యక్షుడు ముష్ణం శ్రీనివాస్, తాళ్లపల్లి సుమన్ పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా రెడ్డబోయిన గోపి వేములవాడ అర్బన్ మండలంలోని సంకేపల్లి గ్రామంలో బిజెపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బుర్ర శేఖర్ గౌడ్‌కు కత్తెర గుర్తు సీరియల్ నెంబర్ 2కు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకటేశ్వరరావు, యువమోర్చా నాయకుడు జింక అనిల్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# కురవి మండలంలో గంజాయి పట్టివేత



**కురవి, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో పోలీసులు భారీగా గంజాయి పట్టివేత చేశారు. కురవి -ఖమ్మం రోడ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నెంబర్ ప్లేట్ లేకుండా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపగా, దానిపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తప్పించుకునే ప్రయత్నం చేశారు. వారిని అదుపులోకి తీసుకుని బ్యాగ్‌ను తనిఖీ చేయగా నిషేధిత గంజాయి బయటపడింది. తూకం వేయగా మొత్తం 3 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులు పటేల్ పవన్ కృష్ణ (23, కరీంనగర్) మరియు ఓర్సు చందు (20, మల్యాల గ్రామం)గా పోలీసులు గుర్తించారు. వీరు విశాఖపట్నం అరకు ప్రాంతంలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, చిన్న చిన్న పాకెట్లుగా తయారు చేసి మహబూబాబాద్‌లో విక్రయించేందుకు తెస్తుండగా పట్టుబడ్డారు. ఈ ఆపరేషన్‌లో కురవి పోలీస్ స్టేషన్‌కి చెందిన ఎస్ఐ గండ్రాతి సతీష్, ఎస్ఐ జయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి పట్టివేతలో వీరి కృషిని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఐపీఎస్, డీసీపీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య అభినందించారు.




# హుజూరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల మద్దతుగా ప్రణవ్ ప్రచారం




**కమలాపూర్, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కమలాపూర్ మండల పరిధిలోని మర్రిపల్లి, మర్రిపల్లిగూడెం, వంగపల్లి, ఉప్పలపల్లి, అంబాల గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈనెల 11, 17వ తేదీల్లో జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో ప్రణవ్‌కు ఘన స్వాగతం లభించగా, అభ్యర్థుల కోసం ప్రజలు ఉత్సాహంగా మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇంకా మూడు సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, అభ్యర్థులను గెలిపించడం ద్వారా గ్రామ సమస్యలు నేరుగా పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరవేయడం తన బాధ్యతగా స్వీకరిస్తానని హామీ ఇచ్చారు. హుజురాబాద్ అభివృద్ధి పట్ల కాంగ్రెస్ పార్టీకి మాత్రమే చిత్తశుద్ధి ఉందని, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అభివృద్ధికి విరోధకులని ప్రణవ్ విమర్శించారు. ప్రజల మధ్యలో ఉంటూ, గెలిచినా ఓడినా సేవ చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నానని అన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి గత రెండు సంవత్సరాల్లో హుజురాబాద్ ప్రజల కోసం ఒక్క రూపాయి నిధులైనా తీసుకురాలేదని ప్రశ్నిస్తూ, ఆయన ప్రవర్తన నియోజకవర్గ పరువును దెబ్బతీస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్యే ఏం చేయలేకపోతే ఆ పార్టీ అభ్యర్థులు ఏం చేస్తారని ప్రజలను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిందని ప్రణవ్ పేర్కొన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకువచ్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ మండల నాయకులు, గ్రామాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర సమావేశం



**హైదరాబాద్, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** హైదరాబాద్‌లోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యాలయంలో డిసెంబర్ 8న రాష్ట్ర సమావేశం జరిగింది. పలు జిల్లాల జిల్లా చైర్మన్లు, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశానికి రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ మరియు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా చైర్మన్లు, పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడిన నాయిని రాజేందర్ రెడ్డి, రక్తదానం సహా మానవతా సేవల్లో రెడ్ క్రాస్ సొసైటీ చేస్తున్న విశేష సేవలను కొనియాడారు. అనారోగ్య అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందించే సహాయం అమూల్యమని పేర్కొన్నారు. రాష్ట్ర పాలకవర్గానికి చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారుల నియామకాలపై ముఖ్యమంత్రితో చర్చించి, రాష్ట్ర గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే జిల్లా చైర్మన్లు, పాలకమండలి సభ్యులను త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసేలా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో అవసరమైన చోట్ల రెడ్ క్రాస్ సొసైటీలకు భూ కేటాయింపు, నూతన భవనాల నిర్మాణం వంటి అంశాల్లో ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని, ఇందుకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి త్వరలో వివరించనున్నట్లు చెప్పారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నెలసరి ఆర్థిక సహాయ పథకం అమలు జరగేందుకు ప్రభుత్వం దృష్టికి తప్పక తీసుకువెళ్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రెడ్ క్రాస్ సేవలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సమావేశం ముగింపులో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని ప్రత్యేకంగా సత్కరించి, నిర్వాహకులు తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, తోట రాజశేఖర్, కె. ప్రసాద్ రావు, జనార్దన్ రావు, మహేందర్ రెడ్డి, జిల్లా చైర్మన్లు గోలి అమరేందర్ రెడ్డి, ఎం. రాజేశ్వర్ రావు, మామిడి భీమ్ రెడ్డి, సాయి చౌదరి, భాస్కర్ రెడ్డి, వనజ రెడ్డి, వరప్రసాద్, కేశవ రెడ్డి, గంగేశ్వర్, సుదర్శన్ రెడ్డి, ఆంజనేయులు, రాజన్న, కోటేశ్వరి, రాధాకృష్ణ, విజయ్, సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మా బిడ్డను రక్షించండి

**మాలి దేశంలో తీవ్రవాదుల చెరలో తెలంగాణ యువకులు**



**కరీంనగర్, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాలి దేశంలో తీవ్రవాదులు కిడ్నాప్ చేసిన నల్లమాసు ప్రవీణ్ రెడ్డి, కుమారాకుల రామచంద్రలకు ఇప్పటికీ ఆచూకీ లభించలేదు. పక్షం రోజులు గడిచినా ఆ దేశ ప్రభుత్వం ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రవీణ్ రెడ్డి తండ్రి జంగయ్యతో పాటు రామచంద్ర సహోద్యోగులు, స్నేహితులు కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పొట్ట చేత పట్టుకుని జీవనం సాగించేందుకు మాలి దేశంలోని రూబీ కంపెనీలో ఏడాది కాలంగా పనిచేస్తున్న ఈ ఇద్దరిని గత నెల 23న జె.ఎన్.ఐ.ఎం తీవ్రవాద సంస్థ సభ్యులు కిడ్నాప్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.తమ బిడ్డలను ఎందుకు కిడ్నాప్ చేశారో కూడా తెలియక, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. వారిని కిడ్నాపర్ల చెర నుండి విడిపించేందుకు మాలి ప్రభుత్వంతో మాట్లాడాలని కేంద్ర మంత్రిని కోరారు.సానుకూలంగా స్పందించిన బండి సంజయ్, భారత విదేశాంగ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి మాలి ప్రభుత్వాన్ని ఒప్పించి తెలంగాణ వాసులను రక్షించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ, ప్రవీణ్, రామచంద్రలను కిడ్నాపర్ల చెర నుండి విడిపించేందుకు తగిన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి 130 కోట్ల నిధులు



**నిజామాబాద్, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి కోసం గత రెండేళ్లలో సుమారు 130 కోట్ల నిధులు సాధించానని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులకు నిధులు మంజూరై పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు.ప్రతి డివిజన్ అభివృద్ధికి టీఫైడిక్ ద్వారా నిధులు తీసుకురావడం, ప్రభుత్వ ప్రత్యేక నిధులలో 37 కోట్లు విడుదల కావడం, నుడా ద్వారా 23 కోట్లు, ఆసుపత్రి అభివృద్ధికి 2.76 కోట్లు, డబుల్ బెడ్‌రూముల నిర్మాణం, మరమ్మత్తులకు నిధులు, ప్రగతి నగర్ స్మశానవాటిక, సోనీ ఫంక్షన్ హాల్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు వివరించారు. ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి పైసా అవినీతి లేకుండా నియోజకవర్గ అభివృద్ధికే ఖర్చు చేస్తానని, ప్రజలకు సేవ చేయడంలో ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని సూర్యనారాయణ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ వాసి సన్నీ రెడ్డికి అమెరికాలో అపూర్వ గౌరవం




**షాద్ నగర్, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమెరికా మిచిగన్ రాష్ట్ర రిపబ్లికన్ పార్టీ కో-చైర్‌గా తెలంగాణకు చెందిన రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ సన్నీ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికతో ఆయన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బృందంలో ఒకరిగా నిలిచారు. నాయకత్వ పటిమ, నిజాయితీ, ప్రజాసేవను గుర్తించిన రిపబ్లికన్ పార్టీ ఆయనను ఈ పదవికి ఎన్నుకోవడం ప్రవాస భారతీయులు ఆనందంగా స్వాగతించారు. అమెరికాలోని 50 రాష్ట్రాల నుంచి ఒక్కొక్కరిని కో-చైర్‌గా ఎన్నుకుంటారు. వీరంతా అధ్యక్షుడికి ఆయా రాష్ట్రాల నుంచి తగిన సూచనలు, సలహాలు అందిస్తారు. ఈ స్థాయిలో నిలిచిన ఏకైక తెలుగు వ్యక్తిగా సన్నీ రెడ్డి చరిత్ర సృష్టించారు.మిచిగన్ రాష్ట్రానికి చెందిన సన్నీ రెడ్డి వెయిన్ స్టేట్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ మెంబర్‌గా కూడా ఎన్నికయ్యారు. 1994లో అదే వర్సిటీలో కెమికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన ఆయన, చివరకు అదే వర్సిటీలో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ మెంబర్‌గా ఎన్నికైన తొలి వ్యక్తిగా నిలిచారు. ఇటీవల ఉత్కంఠభరితంగా సాగిన ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున భారీ మెజార్టీతో విజయం సాధించారు.మిచిగన్ రాష్ట్రంలోని విద్య, ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ఆయన తీసుకున్న నిర్ణయాలు తనను ఈ స్థాయికి తీసుకువచ్చాయని సన్నీ రెడ్డి పేర్కొన్నారు. కాలేజ్ ట్యూషన్ ఖర్చులను తగ్గించి విద్యను అందరికీ అందుబాటులోకి తేవడం, విద్యను రాజకీయాలకు అతీతంగా ఉంచడం, ఆలుమినితో కెరీర్ గైడెన్స్ సేవలను విద్యార్థులకు అందించేలా చేయడం వంటి అంశాలతో ఆయన మిచిగన్ ఓటర్లను ఆకట్టుకున్నారు.అమెరికా తెలుగు సంఘంతో ఆయనకు మంచి సంబంధాలున్నాయి. ప్రస్తుతం ఆటా బోర్డ్ ఆఫ్ ట్రస్టీగా సేవలందిస్తున్నారు. 2017లో హూస్టన్, 2021లో కెంటకీ, 2024లో ఫ్లోరిడా హరికేన్ల సమయంలో అమెరికన్ రెడ్ క్రాస్ సొసైటీతో కలిసి పనిచేసి అవసరమైన ఫండ్స్ సేకరించారు. ట్రంప్ బృందంలో ఆయనకు చోటు లభించడం అమెరికాలోని తెలుగువారికే కాకుండా మొత్తం భారతీయ సమాజానికి గర్వకారణమని ఎన్నారైలు అభిప్రాయపడ్డారు.

# శివాలయం నగర్ మండల ప్రాథమిక పాఠశాల పరిశీలన




**సూరారం, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ పరిధిలోని శివాలయం నగర్‌లో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలను డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ డిసెంబర్ 08న సందర్శించారు. సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా నిర్మాణంలో ఉన్న టాయిలెట్ బ్లాక్‌ను పరిశీలించి, పనుల నాణ్యతపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అదేవిధంగా అంగన్వాడీ సెంటర్‌తో పాటు పాఠశాలలో ఉన్న సదుపాయాలను కూడా పరిశీలించారు.స్కూల్‌లో వాలంటీర్ లేకపోవడం, అంగన్వాడీ సెంటర్‌లో మహిళా హెల్పర్ లేకపోవడం వంటి సమస్యలను విద్యార్థులు, స్థానికుల నుంచి తెలుసుకున్నారు. ఈ అంశాలను గౌరవనీయ ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని భాస్కర్ తెలిపారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా జరుగుతున్న నిర్మాణాల్లో నాణ్యతను కచ్చితంగా పాటించాలని ఆయన అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ రాజశేఖర్, స్థానిక నాయకులు డేవిడ్, చంద్రశేఖర్, రవికుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్‌లో మహిళా కార్మికుల ధర్నా






**మల్లాపూర్, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మల్లాపూర్ ఇండస్ట్రీస్ ఏరియాలోని షాహీ ఎక్స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ముందు సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు మహిళా కార్మికులు అధిక సంఖ్యలో ధర్నా నిర్వహించారు. గత పదేళ్లుగా కంపెనీలో పనిచేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు పాత జీతమే ఇస్తున్నారని, కనీస వేతనం 16,000 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 9,000 రూపాయలు మాత్రమే అందిస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.స్టాక్ ఉన్నప్పుడే డ్యూటీకి రావాలని, మిగతా రోజుల్లో ఇంట్లో ఉండాలని, పని చేసిన రోజులకు మాత్రమే జీతం ఇస్తున్నారని వారు ఆరోపించారు. ప్రస్తుతం 1,500 మంది మహిళా కార్మికులు ఈ కంపెనీలో పనిచేస్తున్నారు. ఎండలో ధర్నా చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం దారుణమని కార్మికులు విమర్శించారు.పోలీసులు కూడా కంపెనీ లోపలికి వెళ్లి సమస్యను వివరించకుండా అడ్డుకోవడం నిరసనకు కారణమైంది. ఇకనైనా ప్రభుత్వం తరఫున సంబంధిత కార్మిక శాఖ అధికారులు పట్టించుకుని కార్మికుల హక్కులను కాపాడాలని, లేని యెడల వివిధ పార్టీ కార్మిక విభాగాల సంస్థలను కలుపుకొని ధర్నాను మరింత ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు.

# బెగ్లూర్‌లో మల్లికార్జున స్వామి బోనాల జాతర



**మహాదేవపూర్, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: మహాదేవపూర్ మండలం బెగ్లూర్ గ్రామంలో నిర్వహించిన మల్లికార్జున స్వామి బోనాల జాతరలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు పాల్గొన్నారు.జాతరకు విచ్చేసిన భక్తుల యోగక్షేమాలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, మల్లికార్జున స్వామి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# మహబూబాబాద్ పట్టణంలో మొబైల్ షాప్‌లో చోరీ

**మహబూబాబాద్, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనానికి సంబంధించిన కేసు నమోదు అయింది. హర్య తండ, రాజోలు గ్రామానికి చెందిన భూక్య పవన్ "పవన్ సెల్ వరల్డ్" పేరిట బందం చేరువ వద్ద మొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు.డిసెంబర్ 6న ఉదయం షాపుకు వచ్చిన బాధితుడు, షాపు కిరాయికి ఉద్దేశించిన రూ.3,000/- నగదును క్యాష్ కౌంటర్‌లో ఉంచి రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. డిసెంబర్ 7 ఆదివారం కావడంతో షాపు తెరవలేదు. డిసెంబర్ 8 ఉదయం షాపు తెరిచి పరిశీలించినప్పుడు వెనుక భాగంలోని వెంటిలేటర్ పగులగొట్టబడినట్లు గమనించాడు. లోపల మొబైల్ ఫోన్లు దొంగిలించబడకపోయినా, క్యాష్ కౌంటర్‌లో ఉంచిన రూ.3,000/- నగదు కనిపించలేదు.గుర్తు తెలియని వ్యక్తులు వెంటిలేటర్ పగులగొట్టి షాపులోకి ప్రవేశించి నగదు దొంగిలించినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.


# అంబేద్కర్ నగర్‌లో 'ఇందిరమ్మ ఇల్లుల' భూమిపూజ



**బోడుప్పల్, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రేటర్ హైదరాబాద్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ అంబేద్కర్ నగర్ కాలనీలో పలు 'ఇందిరమ్మ ఇల్లుల' భూమిపూజ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్ కుమార్, కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా బి - బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ హాజరయ్యారు.భూమిపూజ అనంతరం బొమ్మక్ కల్యాణ్ మాట్లాడుతూ ప్రజల గృహావసరాల పురోగతికి ఈ పథకం మరింత దోహదపడుతుందని, ప్రతి పేదవాడి సొంత ఇంటి కలలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో అంబేద్కర్ నగర్ క్వార్టర్స్ కాలనీ కమిటీ సభ్యులు, వార్డు అధికారులు, ఇందిరా కమిటీ సభ్యులు, కాలనీ నివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు.

# హైదరాబాద్ బిర్లా సైన్స్ సెంటర్‌లో కథా సంకలనం ఆవిష్కరణ






**కరీంనగర్, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్ బిర్లా సైన్స్ సెంటర్ భాస్కర ఆడిటోరియంలో కరీంనగర్‌కు చెందిన ప్రముఖ కవులు సబ్బని లక్ష్మీనారాయణ, సంకేపల్లి నాగేంద్ర శర్మలు ఆంగ్లంలో రచించిన కథల సంకలనం స్టోరీస్ ఫ్రమ్ ఇండియా ఆవిష్కరించబడింది. యుకియోటో అంతర్జాతీయ ప్రచురణల సంస్థ ఈ సంకలనాన్ని వెలువరించింది. ఈ పుస్తకంలో దేశవ్యాప్తంగా 18 మంది కవులు, రచయితల కథలు, కవితలు చోటు చేసుకున్నాయి. సబ్బని లక్ష్మీనారాయణ, సంకేపల్లి నాగేంద్ర శర్మల రచనలు ఆంగ్ల సంకలనంలో చోటు చేసుకోవడం కరీంనగర్ సాహిత్య వర్గాలకు గర్వకారణమైంది. ఈ సందర్భంగా శ్రీ అరబిందో సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు కోల అన్నారెడ్డి, ఉప్పల రామేశం, సాయినగర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ రాజు, ఎన్. సురేందర్ రెడ్డి, పీవీ సాహిత్య పీఠం అధ్యక్షుడు కేవీ సంతోష్ బాబు, పి.ఆర్.టి.యు. తెలంగాణ నగర్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ఉపాధ్యాయ మిత్రులు చిందం రమేష్, వెల్మల జైపాల్ రెడ్డి, బొమ్మకల్ రైతు సంఘం నాయకుడు కె. నారాయణ రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు. ఈ ఆవిష్కరణతో కరీంనగర్ సాహిత్య కీర్తి మరింత విస్తరించిందని పాల్గొన్నవారు పేర్కొన్నారు.

# శాతవాహన యూనివర్సిటీ విద్యార్థుల ధర్నా



**కరీంనగర్, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ శాతవాహన యూనివర్సిటీ విద్యార్థులు ఈరోజు అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. విద్యార్థులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో పరీక్షలు నిర్వహించడం సరైన నిర్ణయం కాదని, దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు ప్రయాణంలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. డిసెంబర్ నెలలోనే రాష్ట్రవ్యాప్తంగా సెట్ పరీక్షలు జరుగుతున్నందున, చాలా మంది విద్యార్థులు వాటికి సిద్ధమవుతున్న పరిస్థితి ఉందని, ఈ నేపథ్యంలో యూనివర్సిటీ పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేయాలని కోరారు. అదేవిధంగా యూనివర్సిటీ లైబ్రరీ టైమింగ్స్ తగ్గించడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించకుండా లైబ్రరీ మూసివేయడం అన్యాయమని విమర్శించారు. విద్యార్థులు అడిగితే వారిని టార్గెట్ చేస్తున్న పరిస్థితి వీసీ వైఖరిని ప్రతిబింబిస్తోందని ఆరోపించారు. విద్యార్థులు తక్షణమే వీసీ చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరించాలని, పరీక్షలను వాయిదా వేసి విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు.

# పోలీస్ కళాబృందం అవగాహన కార్యక్రమం



**మహబూబాబాద్, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో గద్దె రాజగోపాల్ కాలనీలో సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. మంత్రాలు, మూఢనమ్మకాలపై ప్రజలు మోసపోవద్దని, ఆన్లైన్ గేమింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, రోడ్డు భద్రత, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, గంజాయి, డ్రగ్స్ వాడకం యువజీవితాలను నాశనం చేస్తుందని హెచ్చరించారు. ముసలి తల్లిదండ్రులను ఆదరించాలని, 1930 సైబర్ టోల్ నంబర్, "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి, SI షేక్ షాకీర్, జిల్లా పోలీస్ కళాబృందం సభ్యులు పృధ్వీరాజ్, సత్యం, తిరుపతి, తారాసింగ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది, సుమారు 50 మంది కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# పెద్దపల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతు కోరిన దాసరి మనోహర్ రెడ్డి

**పెద్దపల్లి, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లి, జాఫర్‌కంపేట్, ఎదులపురం, చిన్నరత్పల్లి, పెదరత్పల్లి, మాట్లపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ప్రజలు మళ్లీ మోసపోవద్దని హెచ్చరించారు. మహిళలకు నెలకు 2500, వృద్ధాప్య పెన్షన్ 4000, వికలాంగులకు 6000, కల్యాణ లక్ష్మికి తులం బంగారం ఇస్తామని చెప్పి ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. గత రెండు సంవత్సరాలకు మహిళలకు 60,000, పెన్షనర్లకు 48,000, వికలాంగులకు 48,000 బాకీగా ఉందని ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థులు ఓటు అడగడానికి వచ్చినప్పుడు "మాకు బాకీ ఉన్న డబ్బులు ఇవ్వగలరా?" అని ప్రశ్నించాలని ఆయన కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాలంలోనే పెన్షన్‌ను 200 నుండి 2000కి పెంచిన ఘనత తమదేనని, గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కూడా బీఆర్‌ఎస్ పాలనలోనే జరిగిందని గుర్తుచేశారు. "ప్రజలు వాస్తవాలు గుర్తించి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే గ్రామాలు తిరిగి అభివృద్ధి దిశలో నడుస్తాయి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీరామ కాలనీలో ఐదేళ్ల మంచినీటి సమస్యకు పరిష్కారం



**కరీంనగర్, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణం 39వ డివిజన్ పోచమ్మవాడలోని శ్రీరామ కాలనీ ప్రజలు ఐదేళ్లుగా ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యకు కేంద్ర ప్రభుత్వ అమృత్ స్కీం ద్వారా పరిష్కారం లభించింది. దాదాపు ఐదేళ్లుగా నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు ఇటీవల కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులను కలిసి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి అమృత్ స్కీం కింద పైప్‌లైన్ వేసి నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరా ప్రారంభించారు. ఈ సందర్భంగా బిజెపి కాంటెస్టెడ్ కార్పొరేటర్ మాసం గణేష్, స్థానిక ప్రజలతో కలిసి కేంద్ర మంత్రివర్యులు మనోహర్ లాల్ కట్టర్, బండి సంజయ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, నల్ల కనెక్షన్‌ను ప్రారంభించారు. ఏళ్ల తరబడి ఎదురుచూసిన సమస్య పరిష్కారానికి కృషి చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్, మున్సిపల్ కమిషనర్, అధికారులకు కాలనీవాసులు, కార్పొరేటర్ మాసం గణేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



**సిద్దిపేట, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గజ్వేల్ మండలంలోని శ్రీగిరిపల్లి, సింగాటం, జాలిగామా గ్రామాల్లో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లుగా గుర్తించిన పాఠశాలలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. విద్యుత్, లైట్స్, ఫ్యాన్స్, ర్యాంపులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, ఫర్నిచర్ వంటి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ కోసం నెట్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని, ఓటర్ స్లిప్ పంపిణీ 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనుంది. గజ్వేల్, మర్కుక్, ములుగు, జగదేవపూర్, వర్గల్, రాయపోల్, దౌలతాబాద్ మండలాల్లో డిసెంబర్ 9న సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఎన్నికల ప్రచారానికి అనుమతి ఉందని కలెక్టర్ తెలిపారు. ఆ తర్వాత ప్రచారం నిర్వహిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఎన్నికల నిబంధనల మేరకు ఈ మండలాల్లోని మద్యం దుకాణాలను డిసెంబర్ 9 సాయంత్రం 5 గంటల నుంచి 11వ తేదీ ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు మూసివేయాలని ఆదేశించారు.

## పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ కి ఘన సన్మానం



**ఎలిగేడు, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన గ్యాజంగి లక్ష్మణ్ సోమవారం మొట్టమొదటిసారిగా ఎలిగేడు గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక పద్మశాలి సంఘం నాయకులు ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. సన్మాన సభలో మాట్లాడిన గ్యాజంగి లక్ష్మణ్, పద్మశాలి కుల బాంధవులందరూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కలసికట్టుగా ఉండి మన అభ్యర్థులను గెలిపించుకోవాలని, అందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు పద్మశాలి సంఘం అధ్యక్షులు కోడూరు సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ బూర్ల సత్యనారాయణ, కోడూరు సత్యం, బూర్ల వెంకట సత్యం, కట్ల తిరుపతి, వెంగళదాస్ రాజమౌళి, కుసుమ రమేష్, వెంగళదాస్ భాస్కర్, బూర్ల రాజేశం, పోరండ్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి



**కరీంనగర్, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దేవేందర్ (53) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఉదయం గాంధీ చౌరస్తాలో మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ డ్యూటీ నిర్వహించిన ఆయన, ఇంటికి చేరుకున్న వెంటనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. 1992లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరిన దేవేందర్, తరువాత సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా మారి ప్రస్తుతం హెడ్ కానిస్టేబుల్‌గా సేవలందిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ మృతి పట్ల సానుభూతి తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ, సీఐలు, ఎస్ఐలు తదితర అధికారులు ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

# సామూహిక అయ్యప్ప శరణుఘోష, హనుమాన్ చాలీసా పారాయణం



**కరీంనగర్, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అఖిలభారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం 7 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎస్సార్‌ఆర్ కళాశాల మైదానంలో సామూహిక అయ్యప్పస్వామి శరణుఘోష, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు నూటపది మంది భక్తులు పాల్గొన్నారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాజ్ దేశ్ పాండె గురుస్వామి మాట్లాడుతూ, అయ్యప్ప దీక్షాపరులు మరియు సామాన్య ప్రజలు కలిసి భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా సనాతన ధర్మ పరిరక్షణ, దేశభక్తి స్థాపన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తోట శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి, RSS జిల్లా అధ్యక్షుడు వూట్కూరి రాధాకృష్ణ రెడ్డి, అయ్యప్ప దీక్షాపరులు, శ్రీనివాసుల సేవా సంస్థ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం పరిశీలన



**సిద్దిపేట, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి సోమవారం కలెక్టరేట్ పక్కన గల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) గోదాంను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో గోదాంను నియమావళి ప్రకారం ఓపెన్ చేసి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక నియోజకవర్గాల వారీగా భద్రపరిచిన మిషన్‌ల సీల్స్‌ను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, గోదాం లోపల, బయట, పరిసర ప్రాంతం మొత్తం సీసీ కెమెరాల్లో నిక్షిప్తం అవుతుందని కలెక్టర్ ప్రతినిధులకు తెలిపారు. విజిటర్ రిజిస్టర్‌లో సంతకం చేసి, అనంతరం అందరి సమక్షంలో గోదాం ముఖ ద్వారానికి తాళం వేసి సీల్ చేశారు. ఈ మొత్తం ప్రక్రియను వీడియో గ్రఫీ చేశారు.


# కరీంనగర్ రూరల్‌లో మద్యం, నగదు పట్టివేత





**కరీంనగర్, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ రూరల్ మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. జూబ్లీ నగర్, నగునూర్, దుర్శేడ్, చర్ల బూత్కూర్ గ్రామాల్లో తనిఖీలు చేస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.ముద్దసాని సూర్యచందర్, మల్లేని సింహాద్రి, బుద్ధం రమేష్, జంగంపల్లి రవి వద్ద సుమారు 32 లీటర్ల విస్కీ, బీరు బాటిళ్లు లభించాయి. వాటిని స్వాధీనపరచుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.అదే రోజు మధ్యాహ్నం నవనూరు%-%జూబ్లీ నగర్ రోడ్డులో వాహన తనిఖీల సమయంలో వేముల శ్రీకాంత్ (28, రేకుర్తి గ్రామం) వద్ద ఎలాంటి అనుమతి లేకుండా ఒక లక్ష రూపాయల నగదు లభించింది. డబ్బులపై ఆధారాలు చూపలేకపోవడంతో, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఆ నగదును స్వాధీనపరచి మండల తహసీల్దారు, రిటర్నింగ్ అధికారికి పంపించారు.

# కాంగ్రెస్ ఎప్పుడూ మహిళా వ్యతిరేకి : కంగనా రనౌత్



**న్యూఢిల్లీ డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడిపించిన వందేమాతరం గేయానికి ఎట్టకేలకు గుర్తింపు వచ్చిందని, ఆ గేయం జాతి గర్వకారణం అని, కానీ ఆ గేయంలో ఉన్న దుర్గామాత చరణాలను కాంగ్రెస్ పార్టీ తొలగించిందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ అన్నారు. ఇవాళ లోక్‌సభలో వందేమాతరం గేయం గురించి చర్చ జరిగింది. ఆ చర్చలో ప్రధాని మోదీ మాట్లాడుతూ వందేమాతరం గీతాన్ని కాంగ్రెస్ ముక్కలు చేసినట్లు ఆరోపించారు. ఆ అంశం గురించి ఎంపీ కంగనా రనౌత్ స్పందించారు. పార్లమెంట్ ఆవరణలో రిపోర్టర్లతో ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడిపించిన గీతానికి ఇప్పుడు క్రెడిట్ దక్కడం గర్వకారణం అన్నారు. ఆ గేయంలోని దుర్గామాత చరణాలను తొలగించారని, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళా వ్యతిరేకి అని ఆమె ఆరోపించారు.వందేమాతం గీతంలో ఉన్న దుర్గాదేవి చరణాలను 1937లో తొలగించినట్లు ఇటీవల బీజేపీ నేత సీఆర్ కేశవన్ పేర్కొన్నారు. కొన్ని వర్గాల ప్రజలను సంతోషపెట్టేందుకు నెహ్రూ ఆ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆ గేయంలో ఉన్న తొలి రెండు చరణాలను మాత్రమే కాంగ్రెస్ పార్టీ ఆమోదించిందన్నారు. దీంతో ఆ సాంగ్‌పై ఇప్పుడు కొత్తగా చర్చ మొదలైంది. వందేమాతం గీతం గురించి ఎన్నో ఏళ్లుగా చర్చ సాగుతోందని, ఆ పాట గురించి అందరికీ తెలియాలని, మన సంస్కృతి, సంప్రదాయం, చరిత్ర గురించి తెలుసుకోవాలని బీజేపీ ఎంపీ అరుణ్ గోవిల్ అన్నారు.

# త్వరలో వందేభారత్ స్లీపర్స్

**ప్రారంభానికి ముమ్మరంగా ప్రయత్నాలు**



**న్యూఢిల్లీ డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన .వందే భారత్ రైళ్లు దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు దూసుకెళ్తున్నాయి. త్వరలోనే వందే భారత్ స్లీపర్ వెర్షన్‌ను సైతం పట్టాలెక్కించబోతున్నది. ఈ రైలు సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని అందించనున్నాయి. తేజస్ రైలు తరహాలో వేగంగా.. రాజధాని రైలు లాంటి సౌకర్యాలు కలిగిన తొలిరైలు ఢిల్లీ-పాట్నా మార్గంలో నడువనున్నది. డిసెంబర్ చివరి నాటికి ఈ రైలు రాకపోకలు సాగించే అవకాశాలున్నాయి. ఈ రైలు ప్రారంభోత్సవానికి సంబంధించిన పనులన్నీ తుది దశలో ఉన్నాయి. ఈ రైలును ప్రారంభోత్సవం కోసం ప్రయాణికులు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నివేదిక ప్రకారం.. బెంగళూరులోని బీఈఎంఎల్, భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో తయారవుతున్న ఈ వందే భారత్ స్లీపర్ రెండు రేక్‌లలో ఒకటి ఇప్పటికే పూర్తయ్యింది. తొలి రేక్ డిసెంబర్ 12న ఉత్తర రైల్వేకు బయలుదేరుతుంది. ఆ తర్వాత ఢిల్లీ-పాట్నా మార్గంలో ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఈ రైలులో 16 కోచ్‌లు 827 బెర్త్‌లో ఉంటాయి. ఇందులో 611 థర్డ్ ఏసీ, 188 సెకండ్ ఏసీ, 24 ఫస్ట్ ఏసీ బెర్తులు ఉంటాయి. ఈ రైలును అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారు. రైలులో ఆటోమేటిక్ డోర్లు, బయో టాయిలెట్స్, సీసీటీవీ కెమెరాలు, వ్యక్తిగత రీడింగ్ లైట్లు, ప్రీమియం క్వాలిటీతో సౌకర్యవంతమైన ఇంటీరియర్ ఉంటుంది. ఈ రైలు గంటకు గరిష్టంగా 160 కిలోమీటర్ల వేగంతో నడిచేలా రూపొందించారు. ఇందులో కవచ్ సిస్టమ్, క్రాష్ రెసిస్టెంట్ స్ట్రక్చర్ వంటి అధునాతన భద్రత టెక్నాలజీ అమర్చారు. అవసరమైతే కోచ్ సంఖ్యను 24కు పెంచనున్నారు. ఢిల్లీ-రాజేంద్రనగర్ మార్గంలో తేజస్ మార్గంలో నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. వారంలో ఆరు రోజులు రాకపోకలు సాగిస్తుంది. రైలు సాయంత్రం పట్నా రాజేంద్రనగర్ టెర్మినల్ నుంచి సాయంత్రం బయలుదేరి ఉదయం ఢిల్లీకి చేరుకుంటుంది. తిరిగి తేజస్ రైలు తరహాలోనే నడుస్తుంది. నెలాఖరు నాటికి వందే భారత్ స్లీపర్ రైలును రెగ్యులర్‌గా నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నట్లుగా దానాపూర్ డివిజన్ ధ్రువీకరించింది.

# కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు నోటీసులు..

**ఎందుకో తెలుసా..?**



**న్యూఢిల్లీ డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది . 2023లో వరుణ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికను సవాల్ చేస్తూ కె శంకర అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌కు సమాధానం ఇవ్వాలని సిద్ధరామయ్యను ఆదేశిస్తూ కోర్టు ఇవాళ నోటీసులు జారీచేసింది.కాగా 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధన ప్రకారం సిద్ధరామయ్య అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారని, వరుణ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించాలని పిటిషనర్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. దాంతో పిటిషనర్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. సుప్రీంకోర్టు ఇవాళ సిద్ధరామయ్యకు నోటీసులు జారీచేసింది.ఒకవైపు కర్ణాటకలో సీఎం మార్పుపై ఊహాగానాలు తీవ్ర స్థాయిలో చక్కర్లు కొడుతున్న వేళ సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. మరోవైపు నేషనల్ హెరాల్డ్ కేసులో డీకే శివకుమార్‌కు ఆర్థిక నేరాల విభాగం నోటీసులు జారీచేసింది. ఆర్థిక విషయాలు, లావాదేవీలపై శివకుమార్ వివరణ కోరుతూ EOW నోటీసులు ఇచ్చింది.

# ఢిల్లీ విమానాశ్రయంలో భారీగా గంజాయి పట్టివేత

**అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.15 కోట్ల విలువ**



**న్యూఢిల్లీ డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేశ రాజధాని ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు సోమవారం భారీగా విదేశీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి ఢిల్లీకి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల లగేజీ బ్యాగుల్లో దాచిపెట్టి గంజాయిని తరలించే ప్రయత్నం చేస్తుండగా కస్టమ్స్ సిబ్బంది గుర్తించారు. అధికారులకు స్కానింగ్ సమయంలో అనుమానం రావడంతో ఆ ఇద్దరి బ్యాగులను సోదా చేయగా అందులో పెద్ద మొత్తంలో గంజాయి బయటపడింది. అధికారులు స్వాధీనం చేసుకున్న విదేశీ గంజాయికి అంతర్జాతీయ మార్కెట్‌లో దాదాపుగా రూ.15 కోట్లు విలువ ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గంజాయిని స్మగ్లింగ్ చేయడానికి ప్రయత్నించిన కేటుగాళ్లను అధికారులు అక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. విదేశీ మార్గాల ద్వారా డ్రగ్స్ రవాణా పెరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్‌లో తనిఖీలను మరింత కఠినతరం చేసినట్లు కస్టమ్స్ వర్గాలు వెల్లడించాయి.

# మావోయిస్టులకు మరో దెబ్బ

**కీలక నేత రాంధేర్‌తో పాటు పలువురు లొంగుబాటు**



**రాయ్‌పూర్,డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మావోయిస్టులకు మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. సోమవారం ఛత్తీస్‌గఢ్‌లో 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో కీలక నాయకుడు, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రాంధెర్ కూడా ఉన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలిపిన ఎంఎంసీ జోన్‌లో రాంధెర్ కీలకంగా పని చేస్తున్నారు. మావోయిస్టు అగ్రనేత శీర్షనేత మిళింద్ తెల్టుంబే మరణించిన తర్వాత ఎంఎంసీ బాధ్యతలన్నీ రాంధెర్ చూసినట్లు పోలీసులు వెల్లడించారు. తాజాగా లొంగిపోయిన రాంధెర్‌పై రూ.3 కోట్ల రివార్డు ఉందని పోలీసులు ప్రకటించారు. రాంధెర్ లొంగుబాటుతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నక్సల్ క్రియాశీలతను గణనీయంగా తగ్గిస్తుందని భద్రతా వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవలి నెలల్లో వివిధ రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోతుండటం గమనార్హం. మావోయిస్టు నాయకత్వంలో అంతర్గత విభేదాలు, భద్రతాదళాల ఆపరేషన్ల కఠినతరం, ప్రభుత్వ పునరావాస పథకాలు వంటి పరిణామాలు పెద్ద సంఖ్యలో మావోయిస్టుల లొంగుబాటుకు కారణమైనట్లు అధికారులు అభిప్రాయపడ్డారు.

# జెలెన్‌స్కీ శాంతి ప్రణాళికను అంగీకరించడం లేదు : ట్రంప్

**ముగిసిన అమెరికా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య చర్చలు**



**వాషింగ్టన్ డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఉక్రెయిన్ యుద్ధ నివారణ కోసం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక ప్రస్తుతానికి అటకెక్కినట్లే కన్పిస్తోంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధానికి ముగింపు పలకడానికి తాను చేసిన ప్రతిపాదనను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇంకా చదవకపోవడంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శాంతి ప్రణాళిక అమలు విషయంలో ముందుకు సాగడానికి జెలెన్‌స్కీ సిద్ధంగా లేరని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు ఫ్లోరిడాలో అమెరికా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య మూడు రోజుల పాటు జరిగిన చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వకుండానే ముగిశాయి. ఉక్రెయిన్ ప్రతినిధులు తన ప్రతిపాదనపై సానుకూలంగానే స్పందించారని, కానీ జెలెన్‌స్కీ దానిని ఇంకా సమీక్షించలేదని ట్రంప్ విలేకరులకు తెలిపారు.

# బిజినెస్

## భారత్‌లో స్టార్‌లింగ్ సేవలు.. సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ప్రకటించిన మస్క్ సంస్థ




ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన స్టార్‌లింక్ సంస్థ శాటిలైట్ వ్యవస్థ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు భారత్‌లో రంగం సిద్ధమైంది. ఇప్పటికే మన దేశానికి చెందిన జియో, ఎయిర్‌టెల్‌తో స్టార్‌లింక్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. త్వరలో ఇండియాలో కమర్షియల్ సేవలు అందించేందుకు సంస్థ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే నెలవారీ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధరలను సంస్థ తాజాగా వెల్లడించింది.స్టార్‌లింగ్ ఇండియా వెబ్‌సైట్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ సేవలు పొందాలంటే రెసిడెన్షియల్ కస్టమర్లు నెలకు రూ.8,600 చెల్లించాల్సి ఉంటుంది. హార్డ్‌వేర్ కిట్‌కు అదనంగా రూ.34వేలు చెల్లించాలి. ఈ ప్యాకేజీలో సాటిలైట్ డిష్, వై-ఫై రౌటర్, మౌంటింగ్ స్టాండ్, కేబుల్స్, పవర్ అడాప్టర్‌తో కూడిన ప్లగ్-అండ్-ప్లే కిట్ వినియోగదారులకు ఇవ్వనున్నారు. ఈ ప్లాన్‌లో అపరిమిత డేటాతో పాటు 30 రోజుల పాటు ఫ్రీ ట్రయల్‌ను ఆస్వాదించొచ్చుది. 99.9 శాతం కంటే ఎక్కువ నెట్‌వర్క్ అప్‌టైమ్‌తో ఎలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనైనా నిర్విరామంగా ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉంటాయి. వినియోగదారులు దీన్ని కొనుగోలు చేసిన వెంటనే ప్లగ్ ఇన్ చేసి సేవలను ప్రారంభించొచ్చు.

## గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్.. ఎంసీఎక్స్‌లో తులం రూ.1.30లక్షలు దాటిన బంగారం..!

ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ బలంగా ఉండడంతో బంగారం తులం ధర రూ.1,30,638 చేరింది. వెండి ఫ్యూచర్స్ కిలోకు రూ.1,82,600కి పడిపోయింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది చివరి పాలసీ సమావేశం జరుగనున్నది. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవరించారు. దాంతో బంగారానికి డిమాండ్ పెరిగింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో ఫిబ్రవరి 2026 కాంట్రాక్టుకు సంబంధించి గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాములకు 0.13 శాతం పెరిగి రూ.1,30,638కి చేరుకుంది. అయితే, సిలర్వ్ ఫ్యూచర్స్ 0.44 శాతం తగ్గి కిలోకు రూ.1,82,600కి చేరాయి.శుక్రవారం ఎంఎసీఎక్స్‌లో సిల్వర్ రూ.7,096 పెరిగి రికార్డు స్థాయిలో రూ.1,85,234 మార్క్‌ను చేరుకుంది. చివరికు కిలోకు రూ.1,83,408 వద్ద ముగిసింది. గతవారంలో వెండి భారీగా 4.81శాతం వరకు పెరిగి.. 3శాతానికిపైగా లాభపడ్డాయి. తాజాగా ప్రారంభంలో కొంత లాభాల స్వీకరణకు చూసిందని.. కానీ, లండన్, చైనాలో తగ్గుతున్న నిల్వలు, 2026 వరకు నిర్మాణాత్మక లోటు కొనసాగుతుందన్న ఆందోళన మధ్య స్థిరంగా ఉందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ విశ్లేషకుడు మానవ్ మోదీ తెలిపారు.బలమైన పారిశ్రామిక డిమాండ్, సురక్షిత స్వర్గధామ పెట్టుబడికావడంతో కొనసాగుతున్న పెట్టుబడులు ఈటీఎఫ్‌లో వెండిని బలోపేతం చేశాయన్నారు. ఇక ఏడాది చివరి పాలసీ సమావేశానికి ముందు ఫెడ్ రిజర్వ్ రేట్లను సడలించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారని.. దాంతో మార్కెట్ పెరుగుతుందని మోదీ తెలిపారు. ఈ వారం పెట్టుబడిదారుల దృష్టి ఫెడ్ తుది సమావేశంపై మాత్రమే కాకుండా, యూఎస్ ఫ్యాక్టరీ ఆర్డర్లు, ఇతర కీలకమైన స్థూల ఆర్థిక డేటాపై ఉంటుందని చెప్పారు.ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగం వరకు వ్యాపారులు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉందన్నారు. ఎందుకంటే ఫెడ్ వైఖరిలో ఏదైనా మార్పులు బులియన్ ధరల్లో అస్థిరతకు దారి తీసే అవకాశం ఉందన్నారు. రిలయన్స్ సెక్యూరిటీస్‌లో సీనియర్ పరిశోధన విశ్లేషకుడు జిగర్ త్రివేది మాట్లాడుతూ.. బంగారం ధరలు ఔన్సుకు 4,200 డాలర్లకు చేరుకున్నాయి. ఫెడ్ చివరి సమావేశంలో 25 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశం 88శాతం వరకు ఉందని త్రివేది తెలిపారు.వచ్చే ఏడాది సైతం మరిన్ని వడ్డీ రేట్లలో కోత విధించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయి. కామెక్స్‌లో ఫిబ్రవరి డెలివరీకి సంబంధించి గోల్డ్ ఫ్యూచర్లు ఔన్సుకు 4,244.2 డాలర్ల వద్ద స్థిరంగా ట్రేడవుతున్నది. మార్చి 2026 కాంట్రాక్టుకు సంబంధించిన కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్స్ 0.54 శాతం తగ్గి ఔన్సుకు 58.73 డాలర్ల వద్దకు చేరింది. శుక్రవారం సిల్వర్ 4.19శాతం పెరిగి ఆల్‌టైమ్ గరిష్ట స్థాయి ఔన్స్‌కు 59.90 డాలర్లకు పెరిగింది.



## పాత 50 పైసల నాణేలు ఇంకా చెల్లుతాయి..

### వాట్సాప్‌లో ఆర్బీఐ కీలక మెసేజ్‌లు!

పది రూపాయల నాణేలు చెల్లవని చాలా రోజులుగా ఓ ప్రచారం జరుగుతోంది. ఇది నమ్మి కొంతమంది వ్యాపారులు, దుకాణదారులు నాణేలను స్వీకరించడం లేదు. రూ.10 నాణేలు చెల్లుతాయని గతంలోనే పలుమార్లు ఆర్బీఐ క్లారిటీ ఇచ్చినప్పటికీ అదే అపోహ కొనసాగుతోంది. దీంతో నాణేల చెల్లుబాటుపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించి, అవగాహన కలగించేందుకు ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా నాణేల చెల్లుబాటుపై సోమవారం నాడు ప్రజలకు వాట్సాప్‌లో పర్సనల్ మెసేజ్‌లు పంపించింది. నాణేల చెల్లుబాటుపై అవగాహన కల్పించేలా ఒక వీడియోను కూడా షేర్ చేసింది.వాట్సాప్‌లో ఆర్బీఐ పంపిన సందేశం మేరకు.. నాణేలు వేర్వేరు డిజైన్లతో ఉన్నప్పటికీ అవన్నీ చలామణీలో ఉన్నాయని ఆర్బీఐ స్పష్టం చేసింది. 50 పైసలు మొదలుకొని రూ.1, 2, 5, 10, 20 నాణేలు అన్నీ చట్టబద్ధమైనవేనని.. అవన్నీ సుదీర్ఘకాలం చలామణీలో ఉంటాయని తెలిపింది. నాణేల గురించి తప్పుదారి పట్టించే సమాచారాన్ని, పుకార్లను నమ్మవద్దని సూచించింది. ఎలాంటి సందేహం లేకుండా నాణేలను స్వీకరించాలని కోరింది. వ్యాపారులు కూడా సంకోచం లేకుండా ప్రజల నుంచి నాణేలను స్వీకరించాలని విజ్ఞప్తి చేసింది.




# స్పోర్ట్స్

## భారత క్రికెటర్లకు షాకిచ్చిన ఐసీసీ..

### మ్యాచ్ ఫీజులో భారీ కోత..!

విశాఖ వన్డేలో అదిరే విజయంతో సిరీస్ గెలుపొందిన టీమిండియా భారీ షాక్. స్లో ఓవర్ రేటు కారణంగా భారత జట్టుపై అంతర్జాతీయ క్రికెట్ మండలి భారీ జరిమానా విధించింది. సిరీస్‌లో రెండోదైన రాయ్‌పూర్ వన్డే లో నిర్ణీత సమయంలోపు ఓవర్ల పూర్తి చేయనుందన.. భారత క్రికెటర్ల మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించింది ఐసీసీ. ఈ విషయాన్ని సోమవారం ఐసీసీ వెల్లడించింది.స్వదేశంలో దక్షిణాఫ్రికాకు టెస్టు సిరీస్ సమర్పించుకున్న భారత జట్టు వన్డేల్లో మాత్రం పంజా విసిరింది. రాంచీ వన్డేలో ఉత్కంఠ విజయంతో సిరీస్‌లో బోణీ కొట్టిన టీమిండియా.. విరాట్ కోహ్లీ(105), రుతురాజ్ గైక్వాడ్(102) శతకాల మోతతో రాయ్‌పూర్‌లోనూ ప్రత్యర్థికి పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించింది. 359 పరుగుల రికార్డు లక్ష్యాన్ని సఫారీ టీమ్ మరో నాలుగు బంతులు ఉండగానే అందుకుని సిరీస్ సమం చేసింది. అయితే.. ఈ మ్యాచ్‌లో టీమిండియా 2 ఓవర్లు వెనకబడింది. ఈ విషయాన్ని గుర్తించిన రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ఐసీసీ దృష్టికి తీసుకెళ్లారు.ఐసీసీ నిబంధనల్లోని ఆర్టికల్ 2.22 ప్రకారం స్లో ఓవర్ రేటుకు జట్టు సభ్యులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇదే విషయమై విచారణ సందర్భంగా కెప్టెన్ కేఎల్ రాహుల్ తన పొరపాటును అంగీకరించాడు. టీమిండియా ఆటగాళ్లకు ఫైన్ విధించాలనే నిర్ణయాన్ని ఆన్ ఫీల్డ్ అంపైర్లు రాడ్ టక్నర్, రోహన్ పండిట్.. థర్డ్ అంపైర్ సామ్ నొగజ్‌స్కీ, ఫోర్త్ అంపైర్ జయరామన్ మదన్‌గోపాల్ ఆమోదించారు. దాంతో.. రాయ్‌పూర్‌లో స్లో ఓవర్ రేటు కారణంగా భారత క్రికెటర్ల మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది ఐసీసీ. కీలకమైన మూడో వన్డేలో 9 వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది.




## పుమాకు బైబై.. స్టార్టప్ కంపెనీ ప్రచారకర్తగా కోహ్లీ..!

వన్డేల్లో శతకాలతో రెచ్చిపోతున్న సీనియర్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కీలక నిర్ణయం తీసుకున్నాడు. కొన్నాళ్లుగా పుమా బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించిన విరాట్ ఆ సంస్థకు గుడ్ బై చెప్పేశాడు. భారత్‌కు చెందిన 'అజిలిటస్' స్టార్టప్ కంపెనీలో భాగస్వామిగా చేరాడు విరాట్. ఈ విషయాన్ని సోమవారం కోహ్లీ వెల్లడించాడు. అయితే.. తమ ఒప్పందాన్ని పునరుద్ధరించడం కోసం కోహ్లీకి పుమా రూ.300 కోట్లు ఆఫర్ చేసిందట. అయినా సరే అంత పెద్ద మొత్తాన్ని సైతం కాదని అజిలిటస్‌తో డీల్ కుదుర్చుకున్నాడు రన్ మెషీన్.క్రికెట్ ఐకాన్ విరాట్ కోహ్లీ ఓవైపు మైదానంలో అదరగొడుతూనే.. మరోవైపు వ్యాపారంలోనూ రాణిస్తున్నాడు. ఇప్పటికే రెస్టారెంట్ బిజినెస్.. డిజిట్ ఇన్స్యూరెన్స్ కంపెనీలతో భారీగా అర్జిస్తున్న విరాట్ తాజాగా కొత్త స్పోర్ట్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. గత ఏనిమిదేళ్లుగా పుమాతో కొనసాగిన కోహ్లీ.. ఈసారి స్వదేశీ అంకుర సంస్థ అజిలిటస్‌కు జై కొట్టాడు. దిగ్గజ కంపెనీ అయిన పుమాను వదిలేసి.. ఈ స్టార్టప్ కంపెనీ వైపు మొగ్గు చూపడానికి కారణం ఏంటి? అని ప్రశ్నించగా.. ఈ రోజు నుంచి కొత్త అధ్యాయం మొదలవ్వనుంది. స్పష్టమైన లక్ష్యం, మంచి ఉద్దేశంతో వన్ 8, అజిలిటస్ మధ్య కొత్త ప్రయాణం షురూ కానుంది. వన్ 8ను అజిలిటస్ బ్రాండ్‌తో మరింత ముందుకు తీసుకెళ్తా.అజిలిటస్ గంగూలీ నుంచి ఆఫర్ రాగానే నన్నే ఎందుకు ఎంచుకున్నారో అర్ధమైంది. క్రీడా దుస్తులు, పరికరాల తయారీలో వీరి నైపుణ్యం బాగుంది. కచ్చితంగా ఇది నాకు గొప్ప అవకాశం అనిపించింది. అందుకే భాగస్వామిగా చేరాను. ముఖ్యంగా అజిలిటస్ మనదేశపు సంస్థ. మనవాళ్లే డిజైన్లు రూపొందిస్తారు. అందుకే.. ఓకే చెప్పాను అని కోహ్లీ ఒక వీడియోలో వెల్లడించాడు. అజిలిటస్‌లో రూ.40 కోట్లు పెట్టుబడి పెట్టిన విరాట్ 1.94 శాతం వాటా దక్కించుకున్నాడు.




## ఓపెనింగ్ గిల్‌కు దక్కడమే న్యాయం..

### సంజు శాంసన్ బ్యాటింగ్ ఆర్డర్ మార్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సూర్యకుమార్..!



భారత్-దక్షిణాఫ్రికా మధ్య మంగళవారం నుంచి టీ20 సిరీస్ మొదలుకానున్నది. ఐదు మ్యాచుల సిరీస్‌లో తొలి మ్యాచ్ కటక్ వేదికగా జరుగనున్నది. ఈ మ్యాచ్‌కు ముందు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టీమ్ సెలక్షన్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. టెస్టు, వన్డే సిరీస్‌కు దూరమైన శుభ్‌మన్ గిల్ టీ20 జట్టులో చోటు దక్కింది. అయితే, కటక్ టీ20లో శుభ్‌మన్ గిల్‌ను ఓపెనర్‌గా ఆడించనుండగా.. శాంసన్‌ను మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో శాంసన్‌ను బ్యాటింగ్ ఆర్డర్ మార్పుపై వస్తున్న విమర్శలపై టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ స్పందించాడు. ఈ నిర్ణయం కేవలం ఫామ్ ఆధారంగా కాకుండా.. జట్టు కూర్పు, గిల్ పునరాగమనం ఆధారంగా తీసుకున్నట్లు తెలిపాడు.ఆసియా కప్‌లో దాదాపు ఒక సంవత్సరం తర్వాత శుభ్‌మాన్ గిల్ టీ20 ఫార్మాట్‌లో తిరిగి వచ్చాడు. టీమ్ మేనేజ్‌మెంట్ గిల్‌ను ఆల్ ఫార్మాట్ స్టార్‌గా భావిస్తున్నది. ఈ క్రమంలో గిల్ టీ20 జట్టులోకి తీసుకొని.. ఓపెనింగ్ బాధ్యతలను అప్పగించారు. సంజు విషయానికి వస్తే జట్టులోకి వచ్చిన సమయంలో టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేశాడు. సంజు శాంసన్ జట్టులోకి కొత్తగా వచ్చిన సమయంలో టాప్ ఆర్డర్‌లో ఆడాడని.. ఓపెనర్‌గానూ మెరుగ్గా రాణించాడని తెలిపాడు. అయితే, శుభ్‌మన్ గిల్ శ్రీలంక సిరీస్‌లో సంజు కంటే ముందే ఓపెనర్‌గా ఆడాడని.. కాబట్టి ఆ స్థానం అతనికే దక్కడం న్యాయమని సూర్యకుమార్ చెప్పుకొచ్చాడు. టీ20 ఫార్మాట్‌లో ఓపెనర్లు మినహా మిగతా బ్యాటర్లు అందరూ ఏ స్థానంలోనైనా ఆడేందుకు సిద్ధంగా ఉండాలన్నాడు. తాము శాంసన్‌కు సరైన అవకాశాలు ఇచ్చామని.. ప్రస్తుతం మూడు నుంచి ఆరు వరకు ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేసేందుకు రెడీ ఉన్నాడని తెలిపారు. జట్టు అవసరాలకు తగ్గట్టుగా సౌలభ్యం ఉండడం చాలా ముఖ్యమని తెలిపాడు సూర్యకుమార్. గాయం నుంచి కోలుకున్న పాండ్యా తిరిగి జట్టులో చేరడంతో మరింత అదనపు బలాన్ని ఇస్తుందన్న సూర్య.. అతని అనుభవం, కొత్తతో బంతితో బౌలింగ్ చేయగల సామర్థ్యం జట్టుకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పాడు.